www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
శుక్రవారం 9 మే 2025
సంపుటి :06 సంచిక : 339 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## చలివేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు మే 08:**




వేసవి నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దినేష్ మాటోలియా, ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్ తదితరులున్నారు

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు






### హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిందే
### చెరువులను కబ్జా చేసిన వారిని వదిలి పెట్టేది లేదు
### హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభంలో సీఎం రేవంత్



**హైదరాబాద్, మే8( వెలుతురు):** హైడ్రా అంటే కొందరికి కడుపు మంట అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే హైడ్రాపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇళ్లు కూల్చడానికి కాదని.. ఆక్రణదారులను అడ్డుకోవడానికేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. చెరువులు కనుమరుగైతే మన మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు.. హైడ్రా ఉపయోగపడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో తొలి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులను ఆక్రమించిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరేమనుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం హైడ్రా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. వర్షం వస్తే చెన్నై, ముంబై మహానగరాల పరిస్థితి ఏంటో చూస్తున్నామని ఆయన సోదాహరణగా వివరించారు. కాలుష్యంతో ఢిల్లీ విలవిల్లాడుతోంది.. ఈ పరిస్థితికి 2 లో..



# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

- ఇది కొనసాగుతుందని ప్రకటించిన కేంద్రం
- అఖిలపక్ష భేటీలో వివరాలు వెల్లడించిన రాజ్‌నాథ్
- దేశ రక్షణలో రాజీపడబోమని వెల్లడి
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన విపక్ష నేతలు

**న్యూఢిల్లీ, మే8( వెలుతురు):** ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం ఉదయం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆపరేషన్ సిందూర్ విజయం, పర్యవసానాలను ఆయన వివరించారు. సిందూర్ అనేది కొనసాగుతున్న ఆపరేషన్ అని అన్నారు. భారత్ మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేదని, కానీ పాక్ దళాలు దాడిచేస్తే తిరిగి 2 లో..

## ఆపరేషన్ సిందూర్‌లో చిరకాల ఉగ్రవాది హతం

### కాందహార్ విమాన హైజాకర్ అబ్దుల్ రవూఫ్ మృతి



**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):** ఆపరేషన్ సిందూర్‌లో భారత్ చిరకాల ప్రతీకారం కూడా తీరింది. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్‌కు మాస్టర్‌మైండ్, జైషే

# పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ



- లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం
- పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు
- భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు
- సమర్థంగా తిప్పికొట్టిన రోణ దళాలు
- ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు
- భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్





**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):** భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు- భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, 2 లో..

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం



- వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు
- ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన
- పాల్గొన్న నలుగురు మంత్రులు

**ఖమ్మం,మే8 ( వెలుతురు):** ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో 2 లో..

# పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా

- శవపేటికలపై పాక్ జెండాలు కప్పడంలో అర్థం ఏమిటో
- పాకిస్థాన్‌లో ఇలాంటి ఆచారం ఉందేమో
- ఉగ్రవాదులు లక్ష్యంగానే భారత్ దాడులు
- గతంలో దాడులకు సంబంధించిన వివరాలు ఎన్నో ఇచ్చాం
- పాక్ దేనీకి సరైన సమాధానం ఇవ్వలేక పోయింది
- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి



**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక దాడుల్లో కేవలం ఉగ్రవాదులను మాత్రమే హతమార్చినట్లు- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పౌరులు చనిపోయారన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆయన ఖండించారు. భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు హాజరైన చిత్రాన్ని విక్రమ్ మిస్రీ ప్రదర్శించారు. 2 లో..

# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శంకుస్థాపన

- ఆవిష్కరణలు పెట్టుబడులతో భవిష్యత్‌కు బాటలు
- కార్యక్రమంలో మంత్రి లోకేశ్ వెల్లడి

2 లో..




## మూడేళ్లు గట్టిగా పోరాడితే ప్రభుత్వం మనదే

- అప్పడే ఏడాది పూర్తి చేసుకున్న కూటమి
- కళ్లు మూసి తెరిచే లోగా మూడేళ్లు పూర్తవుతాయి
- ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చేసింది
- పార్టీ నేతల సమావేశంలో వైకాపా అధినేత జగన్


2 లో..



**అమరావతి,మే8( వెలుతురు):** మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే.. ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చూస్తుండగానే ఏడాది గడిచింది. కళ్లు మూసుకుని తెరిస్తే మూడేళ్లు గడుస్తాయి.. మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే, ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.. ఇప్పుడు మిమ్మల్ని వేధిస్తున్న

# పునర్విభజన చట్టంలో అమరావతి

- రాజధాని భూ కేటాయింపులకు అనుమతి
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలపై చర్చ
- తీరప్రాంత ,రక్షణరంగ పరిశ్రమల రక్షణకు చర్యలు
- జగన్ హయాం నాటి మూడు తీర్మానాలు వెనక్కి
- అమరావతికి వచ్చిన మోడీకి కృతజ్ఞతలు
- ఆపరేషన్ సింధూర్‌కు అభినందనలు
- ఎపి కేబినేట్‌లో పలు కీలక నిర్ణయాలు



**అమరావతి,మే8( వెలుతురు):** పునర్విభజన చట్టంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి పేరును పునర్విభజన చట్టంలో చేర్చేలా చట్ట సవరణ చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపించ నున్నారు. అలాగే, ఈ భేటీలో అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీకి క్యాబినెట్ ధన్యవాదాలు తెలిపింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద జాగ్రత్తలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ 2 లో..



(మొదటి పేజీ తరువాయి..)

## ఆపరేషన్ సిందూర్‌లో చిరకాల ఉగ్రవాది హతం

ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అజహర్ కూడా హతమయ్యాడు. బహావల్‌పుర్‌లోని మర్కజ్ సుబాన్ కాంప్లెక్స్‌పై భారత్ విరుచుకుపడింది. ఈ దాడిలో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు కలిపి 14 మంది మరణించారు. వీరిలో రవూఫ్ అజహర్ కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ఈ దాడిలో అజహర్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, అతడి భార్య సహా పలువురు మృతి చెందినట్లు- చెబుతున్నారు. రవూఫ్ అజహర్ పలు ఉగ్రదాడుల్లో నిందితుడు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో ఇతడు కూడా ఉన్నాడు. 2002లో ఉగ్రవాదంపై రీసెర్చి చేస్తున్న పెర్ల్ కొంత మంది మతపెద్దలను కలిసేందుకు పాక్‌లోని కరాచీకి వెళ్లాడు. కాందహార్ హైజాక్ సందర్భంగా ఉగ్రవాదులు విడిపించిన ఒమర్ షేక్ ఓ హోటల్ నుంచి పెర్ల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. 1999లో జరిగిన ఐసీ814 విమాన హైజాక్‌లో కూడా రవూఫ్ అజహర్ హస్తం ఉంది. ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్‌కు చేర్చారు. అక్కడి నుంచి భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. భారత జైళ్లలో ఉన్న మసూద్ అజహర్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్ అనే ఉగ్రవాదులను విడిపించుకొని తీసుకెళ్లారు. ఆ తర్వాతే మసూద్ అజహర్ జైషే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. ఇక 2001లో జరిగిన పార్లమెంట్‌పై దాడి, 2016లో పఠాన్ కోట్ దాడి, 2019లో పుల్వామా బాంబింగ్ వంటి ఉగ్ర ఘటనల్లో రవూఫ్ ప్రమేయం ఉంది. ప్రస్తుతం జైషే మొహమ్మద్ కీలక కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## పౌరులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా

శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి ప్రభుత్వ లాంఛనాలతో పౌరులకు అంత్యక్రియలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. మే 7న భారత్ జరిపిన సైనిక దాడులన్నీ జాగ్రత్తగా ఎంచుకున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద లక్ష్యాలపైనే అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. 'ఈ దాడుల్లో ఎవరైనా పౌరులు చనిపోతే, ఈ చిత్రం మీ అందరికీ ఎలాంటి సందేశాన్ని పంపుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది అడగాల్సిన ప్రశ్న. పౌరుల అంత్యక్రియల్లో శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి, ప్రభుత్వ గౌరవం ఇవ్వడం కూడా వింతగా ఉంది. హతమైన వ్యక్తులు ఉగ్రవాదులే. అలాంటి ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బహుశా పాకిస్థాన్‌లో ఒక ఆచారం కావచ్చు. ఇది మాకు పెద్దగా అర్థం కాలేదు' అని అన్నారు. అలాగే మతపరమైన ప్రదేశాలపై భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్ ఆరోపణలను కూడా విక్రమ్ మిస్రి ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని అన్నారు. కేవలం ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు సాగాయని అన్నారు. ఇకపోతే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఈ పాక్ సైన్యం కాల్పుల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. పహల్గామ్ దాడులకు పాల్పడింది తామేనని ఆర్‌టిఎ ప్రకటించిందని, అది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ అని తెలిపారు. అయితే, అంతర్జాతీయ సమాజానికి పాక్ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. ఉగ్రవాదులతో తమక సంబంధాలు లేవని పాక్ బుకాయిస్తోందన్నారు. పాక్‌లో టెర్రరిస్టులు లేరని ఆ దేశ మంత్రి నిస్సిగ్గుగా చెబుతున్నారని.. అనేక దాడుల్లో పాక్ ప్రమేయం ఉందని చాలా సార్లు రుజువైందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదే పాకిస్తాన్ అన్నారు. ముంబై సహా భారత్ లో జరిగిన పలు దాడులపై పాక్ హస్తం ఉందన్నారు. ఉగ్రవాదుల డిఎన్ఎ రికార్డులు, వారి అడ్రస్సులు పాక్‌కు అందించామని.. కానీ పాకిస్తాన్ ఏ అంశంలోనూ స్పందించేదని పేర్కొన్నారు. పాక్ ఏ తీవ్రతతో దాడి చేసిందో అదే తీవ్రతతో ప్రతిదాడి చేశామన్నారు. ఉగ్రసంస్థ గురించి ఐరాసకు పూర్తి సమాచారం ఇచ్చామని తెలిపారు. పాక్ పౌరులు తమ టార్గెట్ కాదని కేవలం ఉగ్రస్థావరాలు మాత్రమే టార్గెట్ చేశామని విక్రమ్ మిస్రీ వివరించారు.

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్సిక్ శంకుస్థాపన

**తిరుపతి,మే8( వెలుతురు):**

ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు- దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుందని లోకేశ్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ- యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు- చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ- ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ- పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు-కు అన్ని రకాలుగా తోడ్పాటు- అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు- చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట-కి మరో మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

## పునర్విభజన చట్టంలో అమరావతి

నిర్వహించిన త్రివిధ దళాలకు క్యాబినెట్ అభినందనలు తెలిపింది. ఆపరేషన్ సిందూర్ అనే పేరు బాగుందని, దేశ ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఈ పేరు ఉందని క్యాబినెట్ అభిప్రాయపడింది. ఇదే తరహాలో రాష్ట్రంలోని పలు సంక్షేమ పథకాలకు మంచి పేర్లు పెట్టేలా దృష్టిపెట్టాలని నిర్ణయించింది. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. విశాఖ, మచిలీపట్నం, నాగాయలంకలలో వంటి ప్రదేశాల్లో భద్రత, కార్యాచరణపై మంత్రులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. తీర ప్రాంతాల్లో భద్రతకు సంబంధించి జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం పెంపు, రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి మెగా ఈవెంట్స్ నిర్వహించే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ- విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో ఆమోదించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 3 చట్టసవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాని క్యాబినెట్‌లో నిర్ణయించారు. మరోవైపు, ప్రధాని నరేంద్రమోడీ ఏపీ టూర్ లో ప్రధాన వేదిక పై సీటింగ్ ఏర్పాటు- పై మంత్రి వర్గంలో చర్చకు వచ్చిందట.. కేంద్ర మంత్రులను ఒక వైపు.. ఏపీ మంత్రులను మరోపక్క కూర్చునేల ప్రోటోకాల్ జాగ్రత్తలు తీసుకోవాల్సిందన్న సీఎం చంద్రబాబు. తన పక్కన డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ సీట్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిందన్నారు.. మరోసారి ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు..ఇక, జలవనరుల శాఖలో కంపెనీల చట్టం కింద జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది.. చెరువుల్లో తవ్విన మట్టిని ఉచితంగా పొలాలకు తరలించేందుకు రైతులకు అనుమతి ఇస్తూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. టీటీడీలో అర్బన్ డిజైన్ ప్లానింగ్ సెల్ ఏర్పాటు-కు కేబినెట్ ఆమోదం తెలిపింది.2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కేబినెట్ కోరింది. పునర్విభజన చట్టంలో రాజధానిగా అమరావతి అని పెట్టాలని మంత్రి మండలి కోరింది. దీని వలన అమరావతికి చట్టబద్ధత కల్పించినట్టు- అవుతుందని కేబినెట్ పేర్కొంది. క్యాపిటల్ అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. 2014 పునర్విభజన చట్టంలో రాజధాని అమరాతి అని లేదని.. ఒకసారి పునర్విభజన చట్టంలో రాజధాని అమరావతి అని నిర్ణయిస్తే రాజధానికి చట్టబద్ధత కల్పించినట్లు- అవుతుందని పలువురు న్యాయనిపుణులతో పాటు- ఇటీ-వల సీఎం చంద్రబాబును కలిసిన రైతులు కూడా సూచించారు. ఈ క్రమంలో రాజధాని అమరావతిగా నిర్ణయించి కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించారు. 2014 పునర్విభజన చట్టాన్ని కేంద్రంలో ఉన్న ఉభయసభలు ఆమోదించాయి. అందువల్ల వాటికి చట్టసవరణ చేయాలి అంటే రాజ్యసభ, లోకసభ చేయాల్సి ఉండటంతో ఏపీ రాజధాని అమరావతి అని పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని అభ్యర్థించారు.

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

మానవ తప్పిదాలే కారణమని ఆయన పేర్కొన్నారు. మంచి పరిపాలన అందించేందుకు గడిచిన 76 ఏళ్లలో.. రాజ్యాంగాన్ని 100 సార్లకుపైగా సవరించుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తు చేశారు. నగరాభివృద్ధి కోసం గత సీఎంలు ఎన్నో చట్టాలు చేశారన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు చూసి.. అప్పటి నిజాం నవాబు కన్నీరు సైతం పెట్టు-కున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనంతరం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే 122 హైడ్రా వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా తొమ్మిదిన్నర నెలల్లో ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారాలు.. హైడ్రా పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారన్నారు. వివిధ సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం ఏ ఉద్దేశ్యంతో హైడ్రాను ప్రారంభించారో.. అదే ఉద్దేశ్యంతో ఈ సంస్థ పని చేస్తుందని వివరించారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళ్తుందని చెప్పారు. అసెస్ట్ ప్రొటెక్షన్ మాత్రమే కాకుండా.. డిజాస్టర్ రెస్పాండ్స్ కూడా సరైన అధికారులతో హైడ్రా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానం కూడా పెద్ద ఎత్తులో వాడుతూ ఎఫ్‌టీ-ఎల్ పరిధి గుర్తిస్తున్నామన్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు- ద్వారా ల్యాండ్ గ్రేబింగ్, చీటింగ్, ఫోర్జరీ చేసే వారిపై చర్యలు తీసుకోనే అవకాశం దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హైడ్రా ఇలాగే ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మితోపాటు- పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

ఎదురు దాడి చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, ఎస్.జయశంకర్, జె.పి.నడ్డా, నిర్మలా సీతారామన్ ప్రభుత్వం తరపున హాజరవగా, కాంగ్రెస్ నుండి లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టిఎంసి నుండి సందీప్ బందోపాధ్యాయ, డిఎంకె నుండి టి.ఆర్.బాలులు సమావేశానికి హాజరయ్యారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటు-వంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాన్ని అఖిలక్షం సమర్థించింది. సైన్యానికి బాసటగా ఉంటామని రాహుల్ తదితరులు ప్రకటించారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అప్పుడే ముగిసిపోలేదని కేంద్రం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదని, ఇంకా కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే భద్రతా కారణాల రీత్య ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను బయటపెట్టలేమని అన్నారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ అసత్య ప్రచారం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కిరణ్ రిజిజు చెప్పారు. కాగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన ఈ సర్జికల్ ÷-టసైక్స్‌లో మొత్తం 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు.

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు- ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు- ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైె విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు- చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ- వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ-వర్ సెంటర్ ఏర్పాటు- చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజినల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు- చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు- చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు- చేస్తున్నామని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్సులు విద్యార్థులకు అందుబాటు-లో ఉంచబోతున్నామని, పేద వారికి వైద్యం అందుబాటు-లో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్ము, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు- విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మెర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్‌కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు-, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు- పాకిస్థాన్ ప్రకటించింది.

# మూడేళ్లు గట్టిగా పోరాడితే ప్రభుత్వం మనదే

వారెవ్వరినీ వదిలిపెట్టబోం.. మనం అధికారంలోకి వచ్చాక, వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు..వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ-, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ-, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీ-సీలతో పాటు- ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. నాడు-నేడు లేదు. ఇంగ్లీస్ మీడియం లేదు... పిల్లలకు ట్యాబ్‌లు లేవు. గోరుముద్ద సక్రమంగా లేదు.. గవర్నమెంట్ బడులు రివర్స్‌లోకి వెళ్లాయి.. పిల్లలు ఎదగాలంటే, ఆ కుటు-ంబం బాగు పడాలంటే, ఆ పిల్లవాడు బాగా చదవాలి అన్నారు వైఎస్ జగన్.. మన ప్రభుత్వంలో ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యాదీవెన ఇచ్చాం. అందుకే ప్రతి మూడు నెలలకు 700 కోట్లు-, అలా ఏటా 2800 కోట్లు-, వసతి దీవెన కింద మరో 1100 కోట్లు- ఇవ్వాలి.. ఇచ్చాం. కానీ, ఈ పెద్దమనిషి చంద్రబాబు గత ఏడాది 3900 కోట్లకు బదులు 700 కోట్లు- మాత్రమే ఇచ్చాడు.. ఈ ఏడాది ఏమీ ఇవ్వలేదు. దీంతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు.. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. మనం పక్కాగా అమలు చేశాం.. ఇంకా ఆరోగ్య ఆసరా అమలు చేశాం. ఆరోగ్యశ్రీకి నెలకు 300 కోట్లు- కావాలి. రూపాయి ఇవ్వలేదు.. ఆరోగ్య ఆసరా ఇవ్వడం లేదు. దీంతో పేదలు వైద్యం కోసం అప్పులు చేయాల్సి వస్తోంది.. రైతులకు ఏ పంటకూ గిట్టు-బాటు- ధర రావడం లేదు. రైతు



ఈరోజు దళారుల పాలయ్యాడు. టమోటా కిలో 2 కూడా రావడం లేదు. ఆర్బీకేలు నీరు గారిపోయాయి. ఉచిత పంటల బీమా లేదు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యం జరిగినా, ప్రభుత్వ యంత్రాంగం కనిపించేది. సీజన్ ముగిసేలోగా వారిని ఆదుకునే వాళ్లం.. ఇప్పుడు విచ్చలవిడిగా ఎక్కడ చూసినా అవినీతి యథేచ్ఛగా రాజ్యమేలుతోంది.. రైతులకు ఉచితంగా విద్యుత్ ఇవ్వడం కోసం యూనిట్ విద్యుత్ కొనుగోలు కోసం సెకీతో 2.49కి ఒప్పందం చేసుకుంటే, ఈరోజు 4.60కి ఒప్పందం చేసుకున్నారు.. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ, ఊరూ పేరూ లేని ఉర్సా కంపెనీకి రూపాయికి 3 వేల కోట్ల విలువైన భూమి. లులూ కంపెనీకి కూడా 1500 కోట్ల విలువైన భూమి ఇచ్చారని ఆరోపించారు. ఇక, మద్యం. ఎక్కడ చూసినా అందుబాటు-లో ఉంది.. ఊరూరా బెల్టుషాప్‌లు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. డోర్ డెలివరీ చేస్తున్నారు అని దుయ్యబట్టారు జగన్.. ఉచిత ఇసుక పేరుకే. కానీ, ఎక్కువ ధరకు ఇస్తున్నారు. మనం వర్షాకాల సీజన్‌ను దృష్టిలో పెట్టు-కుని 80 లక్షల టన్నులు స్టాక్ పెడితే, ఈ ప్రభుత్వం వచ్చీ రాగానే ఎక్కడికక్కడ అమ్మేసుకున్నారు.. ఇప్పుడు రాష్ట్రంలో ఏ కంపెనీ నడపాలన్నా, ఎక్కడ ఏ మైనింగ్ చేయాలన్నా ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిందే అని విమర్శించారు. బాండ్ల పేరుతో కొత్త అవినీతికి తెరలేపారిన ఆరోపించారు.. ఇంత పచ్చిగా అవినీతి చేస్తూ, దాన్ని గత మన ప్రభుత్వం మీదకు నెడుతూ, అదే పనిగా తప్పుడు ఆరోపణలు. విమర్శలు చేస్తున్నారు.. కొత్తగా బాండ్ల పేరుతో అవినీతి. ఏపీ ఎండీసీలో కొత్తగా బాండ్లు జారీ చేస్తూ, అవినీతికి పాల్పడుతున్నారు. అలా కోరుకున్న వారికి గనులన్నీ ఇచ్చుకునే తంతు చేస్తున్నారు. ఇలాంటి అవినీతి వ్యవహారం ఇప్పటి వరకు చూడలేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉగ్రవాదాన్ని ఎగదోస్తే.. మీకు నూకలు చెల్లినట్లే

- భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడాల్సిందే
- దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తే తాటతీస్తాం
- ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా ర్యాలీలో సిఎం రేవంత్








**హైదరాబాద్,మే 8( వెలుతురు):**



ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించేది లేదని దయాది దేశం పాకిస్థాన్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు- పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ రక్షణలో అందరం ఒక్కటేనని చాటుతూ తెలంగాణ గడ్డ నుంచి భారత జవాన్లకు స్ఫూర్తి నిచ్చేందుకే ఈ సంఘీభావ ర్యాలీ చేపట్టినట్లు- ఆయన వివరించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని ఎవరైనా దెబ్బతీయాలని చూస్తే వారికి నూకలు చెల్లినట్లేనని.. ఇది మా హెచ్చరిక అంటూ సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుతామని ఆయన తెలిపారు. మేం శాంతి కాముకులమని ఆయన పేర్కొన్నారు. అది మా చేతగానితనం అనుకుని మా ఆడబిడ్డల నుదిటి సిందూరం తుడిచేయాలనుకుంటే.. వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా సమాధానం చెబుతామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత సైన్యానికి మద్దతుగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ భారత సార్వభౌమత్వం మీద దాడి చేయాలని చూసేవారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్లేనని సీఎం రేవంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉగ్రమూకలకు ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పాక్ ఉగ్రవాదులు, పాక్ పాలకులు, అంతర్జాతీయ ముఖచిత్రంలో ఉన్న ఏ దేశమైనా సరే ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత సార్వభౌమత్వంపై దాడి చేయాలనుకొని.. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఈ భూమ్మీద మీకు నూకలు చెల్లినట్లే. భూమ్మీద మీరు నివసించేందుకు అర్హత కోల్పోయినట్లే. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయాలు ఉండొచ్చు. భిన్న సిద్ధాంతాలు ఉండొచ్చు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఉగ్రవాదుల పీచమణిచేందుకు ఏ చర్య తీసుకున్నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇదీ భారతీయుల స్ఫూర్తి అని అన్నారు. బ్రిటిష్ వాళ్ల నుంచి శాంతి ద్వారానే భారత్‌తో పాటు- పాక్‌కు కూడా స్వేచ్ఛా వాయువులు అందించి అమరుడయ్యారు మహాత్ముడు. ఆయన చేసిన శాంతియుత పోరాటం వల్లే మనం ఈరోజు స్వేచ్ఛను అనుభవిస్తున్నాం. ఆయన శాంతి సిద్ధాంతాన్ని పుణికి పుచ్చుకున్న భారతీయులు శాంతిని కోరుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచే దిశగా కొనసాగుతున్నారు. మా శాంతి ఆకాంక్షను చేతగానితనంగా భావించి ఎవరైనా మా భూభాగంలో కాలుమోపి.. మా ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేయాలని అనుకుంటే.. ఆపరేషన్ సిందూరే మీకు సమాధానం. ఆపరేషన్ సిందూర్ ద్వారానే మిమ్మల్ని నేలమట్టం చేసే శక్తి మా వీర జవాన్లకు ఉంది. ఆ వీర జవాన్‌లకు 140 కోట్ల భారతీయులు అండగా నిలబడతారని ఈ ర్యాలీ ద్వారా సందేశం ఇవ్వదలచుకున్నాం అని రేవంత్ అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు కొనసాగింది. జాతీయ జెండాలను చేతబూని ర్యాలీగా ముందుకు సాగారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ ర్యాలీలో డిప్యూటీ- సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ విజయశాంతి, సచివాలయ ఉద్యోగులు, మాజీ సైనికాధికారులు, భారీ సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. అంతకుముందు గురువారం సాయంత్రం ఈ సంఘీభావ ర్యాలీ సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం పహల్గాం మృతులకు సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్‌లోని పలువురు మంత్రులు ఘనంగా నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి.. వారి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలపాటు- మౌనం పాటించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ప్రతీకార చర్యగా బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అందులోభాగంగా పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మూకల స్థావరాలను నేలమట్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ చర్య పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

# బీసీ వెల్ఫేర్ లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన 121 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు మే 08:**



బీసీ వెల్ఫేర్ లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికైన 121 మంది అభ్యర్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య వసతి అందించడానికి విశేష కృషి చేస్తున్నరాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియామకంలో కీలకమైన అడుగు వేసింది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నాణ్యమైన విద్య మరియు వసతి సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ను ఎంపిక చేసి వాళ్ళకు నియామక పత్రాలు ఇవ్వడం ఆనందదాయకం. హాస్టల్ లో ఉండే పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇది నిదర్శనం. ప్రస్తుతం బీసీ వెల్ఫేర్ లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 లో ఉన్నవారు 485 మంది. కాగా టీజీపీఎస్సీ ద్వారా నూట నలభై పోస్టులు శాంక్షన్ చేయగా వారికి పరీక్ష నిర్వహించి ఎంపిక చేశారు. అయితే వారిలో 8 మంది హైకోర్టుకు వెళ్లిన పోస్టింగ్ పెండింగ్ లో ఉంది. 132 మంది లో ఈరోజు 121 మందికి నియామక పత్రాలు మంత్రి గారి చేతుల మీదుగా అందజేస్తున్నారు. 11 మంది అభ్యర్థులు వివిధ కారణాలవల్ల ఈరోజు హాజరు కాలేకపోయారు.



బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న మొత్తం హాస్టల్స్ 703. ఇందులో ప్రీ మెట్రిక్ హాస్టల్స్ 390, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ 313. ప్రీ మెట్రిక్ హాస్టల్ లో 32,161 మంది, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో 40, 639 మంది విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 1330 రూపాయలు, 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు 1540 ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లిస్తుంది. అదేవిధంగా పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నెలకు 2000 రూపాయలను కేటాయించింది. భోజనము వసతి సదుపాయాలతో పాటు ప్రతి విద్యార్థి బెడ్ షీట్స్, కార్పెట్, యూనిఫామ్, లాంగ్ అండ్ షార్ట్ నోట్ బుక్స్, రికార్డ్ బుక్స్, గ్రాఫ్ బుక్స్ అందిస్తున్నారు.


# జిహాద్ పేరుతో హత్యలు చేస్తారా

- ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తారా
- పాక్ ఘాతుకాలపై మండిపడ్డ ఓవైసీ

**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):**



భారతదేశంపై జిహాద్ పేరిట హత్యలు చేయాలని పాకిస్తాన్ మద్దతుతో ఉన్న ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మరోసారి ఉగ్రవాదంపై ఘాటు వ్యాఖ్యలు చేసారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యత వహించిన లష్కరే తోయిబాకి అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ పై అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఇకపోతే, భారత వైమానిక దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై ఎయిర్÷-టస్ట్రైక్స్ నిర్వహించిన మరుసటి రోజు గురువారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అన్ని పార్టీల సమావేశంలో ఓవైసీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్ ను విజయవం తంగా నిర్వహించిన భారత సాయుధ దళాలకు, ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. అలాగే టిఆర్ఎఫ్‌పై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రచారం ప్రారంభించాలని, అమెరికా కూడా దీన్ని విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరిలో హాఫీజ్ అబ్దుర్ రౌఫ్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 'ఈ ఏడాది జిహాద్ చేయాలి' అని అన్నారని ఆయన గుర్తు చేసారు. 'జిహాద్' పేరిట భారతదేశంలో హత్యలు, భయోత్పాతం సృష్టించడమే వారి లక్ష్యమని, పాకిస్తాన్‌ను ఉగ్ర లిస్ట్ లో చేర్చాలని ఆయన కోరారు. అలాగేప్రభుత్వం కూడా ఉగ్రసంస్థను నిషేధించి పాకిస్తాన్‌పై ఆంక్షలు విధించాలని ఓవైసీ తెలిపారు. కశ్మీరీ ప్రజలను భారత్‌కు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని, పూంఛ్‌లో పౌరులు హత్యకు గురవడం, ఉరి ప్రాంతంలో ప్రజలు తమ ఇల్లు కోల్పోవడం తీవ్ర విషాదకరం అని తెలిపారు. అలాగే ఘటనలో బాధితులను ఉగ్రవాద ఘటనల బాధితులుగా గుర్తించి, వారికి తగిన పరిహారం అందించాలని అలాగే వారి ఇళ్లను తిరిగి నిర్మించాలని.. కేంద్ర ప్రభుత్వం అందుకు బాధ్యత తీసుకోవాలని సూచించారు.



# సంపాదకీయం..

## పివోకే స్వాధీనంతో పాక్‌కు బుద్ధి చెప్పాలి !

ఒక్క ఆపరేషన్ సిందూర్‌తో పాక్ దుష్టబుద్ధిని అణచివేయలేం. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న తీరును దారికి తేలేము. దాని వక్రబుద్ధిని మార్చలేము. భారత్‌తో పెట్టుకుంటే ఇక జీవితం లేదన్న రీతిలో తగిన బుద్ధి చెప్పాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను సంపూర్ణంగా శాశ్వతంగా సాధించాలి. ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలి. జీవితంలో మళ్లీ కోలుకోలేని విధంగా బుద్ధి చెప్పాలి. ఇది అంత సులవయిన పని కాకున్నా ఇందుకు మనం కొంత త్యాగం చేయక తప్పదు. పివోకెపుశాశ్వతంగా స్వాధీనం చేసుకుంటే తప్ప పాక్‌ను కట్టడి చేయలేమని మోడీ గుర్తించాలి. మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు నోరు మూసుకుంటే మంచిది. పహల్గామ్ దాడి తరవాత ఆయన చేసిన వ్యాఖ్యలు క్షంతవ్యం కాదు.ఇకపోతే పాక్ను దారికి తేవాలంటే శాశ్వతంగా దాని మెడలు వంచాల్సిన అవసరం ఉంది. అది ఎప్పుడో జరగాల్సి ఉన్నా..నెహ్రూ, ఇందిరల నిర్వాకం వల్ల భారత్ ఎంతో మూల్యం చెల్లించుకుంది. నెహ్రూను ప్రధానిని చేయడం లక్ష్యంగా గాంధీ అనుసరించిన విధానం కారణంగా జిన్నా పాక్ ఏర్పాటును బలంగా తీసుకుని వెళ్లారు. ఆంగ్ల పాలకులుకూడా ఇదే అదనుగా దేశాన్ని అడ్డంగా విభజించి గీతలు గీసారు. దీనిని ఆనాటి నాయకులు ఏ రకంగానూ వ్యతిరేకించలేదు. దేశ విభజన ఓ చీకటి అధ్యాంయగా మిగిలిపోయింది. విభజన సందర్భంగా వేల్లలో ముస్లింలు పాక్ వైపు వెళితే..లక్షల్లో హిందువుల శవాలు భారత్‌కు తరలించారు. ఆనాటి ఊచకోత గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇలా ఊచకోతలు, బలవంతపు మతమార్పిళ్లతో ఇస్లామిక్ రాజ్యంగా అవతరించిన పాక్ ఆదినుంచీ భారత్ వ్యతిరకతను నరనరాన జీర్ణించుకుంది. కాశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించింది. దానిని పరిష్కరించలేక పోయిన నెహ్రూ **370** ఆర్టికల్‌తో కొత్త సమస్యలు తెచ్చి పెట్టారు. ఈ సమస్యను పరిష్కరించడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని నాటి కాంగ్రెస్ పాలకులు జారవిడుచుకున్నారు. ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీన పర్చుకుంటే తప్ప పాక్ కోరలు పీకలేం. ప్రస్తుత పరిస్థితుల్లో యుద్ధమంటూ జరిగితే ..అది పివోకెను ఆక్రమించుకునేదిగా మాత్రమే ఉండాలి. కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్తాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. అంతర్జాతీయంగా యాగీ చేస్తున్నారు. పివోకెలో ఉగ్రశిబిరాలను ఏర్పాటు చేసి దాడులకు ఉసిగొల్పుతున్నారు. చివరకు ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవాదకలు పాక్ సైనికులు సలాం కొట్టారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపు కోవడమే పనిగా పెట్టుకుని ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌కు గర్వహంగా చేయాలి. దాని ఉనికిని సవాల్ చేయాలి. కుంటూనే ఉన్నారు. భారత్ నుంచి విడిపోయి పాక్‌గా ఏర్పడ్డ పాక్... భారతదేశం తమకు శత్రువని పదేపదే రుజువు చేసుకుంటోంది. పాక్ సైనికాధికారులు ఎప్పుడూ భారత వ్యతిరేకతను నూరిపోస్తున్నారు. తాజాగా ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని పోషిస్తున్నాయి. కాశ్మీర్‌పై అక్కసు వెళ్లగక్కు తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో పదేపదే ప్రస్తావించి భంగపడ్డా పాక్‌కు బుద్ధ ఇరావడం లేదు. **1971**లో జరిగిన యుద్ధంతో బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగినా...పాక్ వంకర బుద్దిని మార్చుకోలేదు. **1999**లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారడంలేదు. ఉగ్రవావాలను పెంచి పోషించడంతో పాటు అబోటాబాద్‌లో లాడెన్‌కు ఆశ్రయమిచ్చి దాచి పెట్టాయి. అమెరికన్ దళాలు ఒసామాబిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత కూడా పాక్ సైన్యం బుద్ధి మారడం లేదు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుం టుందని తెలిసి కూడా కుక్కతోక వంకరలా బుద్ధి మార్చుకోవడం లేదు. పాక్ బడ్జెట్‌లో **30**శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు **41** శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానకోవడం లేదు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఊచకోతకు దారితీసింది.హిందువులను పేరుపెట్టి క్రూరంగా చంపిన ఘటనకు పాక్‌ను ఎంతగా ధ్వంసం చేసినా తక్కువే. అందుకే ఇప్పుడు సిందూర్‌తోనే మన దాడి ఆగకూడదు. ఇలాంటి దాడులు కొనసాగాలి. మనం కొంత నష్టపోయినా శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలి. భారత్‌లో జోక్యం చేసుకోకుండా, ఉగ్రవాదులను ప్రోత్సహించ కుండా కట్టడి చేయాలి. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసి అడుక్కుతినేలా చేయాలి. ఎందుకంటే ఒక్క పాక్ వల్లనే భారత్ ఎంతగానో నష్టపోయింది. పహల్గాం ఉగ్రదాడి ఉచ్చు తమచుట్టూ బిగుస్తోందని, భారత్ నుంచి ప్రతీకార దాడి తప్పదని లోలోపల పాక్ బెంబేలెత్తుతున్నా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శి స్తోంది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ప్రేలాపనలు చేస్తూనే ఉన్నాడు. పాక్ సార్వభౌమాధి కారానికి, ప్రాదేశిక సమగ్రతకు ముప్పు తలెత్తినట్లయితే పాకిస్థాన్ పూర్తి సైనిక సత్తా చాటుతుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి వారికి గట్టి బుద్ధి చెప్పాలి. సిందూర్ ఆపరేషన్ అంతంకాదు..ఆరంభమని ఆర్మీ మాజీ చీఫ్ నరవాణె చేసిన వ్యాఖ్యలు నిజం కావాలి.

# బలూచీలో వరుస దాడులు

## ఐఈడి పేలుడుతో 14మంది పాక్ జవాన్ల దుర్మరణం



**ఇస్లామాబాద్,మే8( వెలుతురు):**
బీఎల్ఏ వరుస దాడులతో పాక్ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పాక్ ఆర్మీ వాహనంపై బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడి చేసింది. ఐఈడీ బాంబులతో పాక్ ఆర్మీ వాహనాన్ని పేల్చివేసింది. మాచ్‌కుండ్ ప్రాంతంలో బీఎల్ఏ దళాలు ఐఈడీ పేల్చాయి. ఈ దాడిలో 14 మంది పాక్ సైనికులు మృతి చెందారు. బలూచిస్థాన్‌లోని బిలాన్ పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు దాడుల్లో 14 మంది పాక్ ఆర్మీ జవాన్లు హతమయ్యారు. బిలాన్‌లోని మాచ్‌లోని షోర్కాండ్ ప్రాంతంలో పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై బీఎల్ఏ రిమోట్ క్రంటోల్ ఐఈడీ దాడి చేసింది. ఈ దాడిలో 12 మంది సైనికులు మరణించారు. మరణించిన సైనికుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ తారిక్ ఇమ్రాన్, సుబేదర్ ఉమర్ షరూక్ ఉన్నారు. ఈ పేలుడు ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఇక మరోచోట బీఎల్ఏ నిర్వహించిన రెండో దాడిలో ఇద్దరు పాక్ జవాన్లు మృతి చెందారు. కచ్‌లోని కులాగ్ టిగ్రామ్ ప్రాంతంలో పాక్ సైనికులను లక్షయంగా చేసుకుని ఐఈడీ పేలుడు బాంబులు అమర్చి ఇద్దరు సైనికులను హతమార్చారు. ఈ రెండు దాడులు తామే చేశామని బీఎల్ఏ ఓ ప్రకటనను కూడా విడుదల చేసింది. అంతే కాకుండా పాక్ ఆర్మీపై బీఎల్ఏ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్ ఆర్మీని కిరాయి ముఠాగా ప్రకటనలో తెలిపింది. కాగా.. రెండు రోజుల క్రితం కూడా బలూచిస్థానలో జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు పాక్ ఆర్మీ ప్రాణాలు కోల్పోయారు. కచ్ జిల్లాలోని మాచ్ ప్రాంతంలో పాక్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఐఈడీతో పేల్చేశారు. ఈ పేలుళ్లో ఏడుగురు పాక్ సైన్యం మృతి చెందారు. అయితే ఈ దాడికి పాల్పడింది బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఉగ్రవాదులుగా పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో వరుస పేలుళ్లు జరిగాయి. లాహోర్ వాల్టన్ రోడ్‌లోని సైనిక విమానాశ్రయం వెలుపల మూడు పేలుళ్లు సంభవించాయి. పేలుళ్లను పాకిస్థాన్ అధికారులు ధృవీకరించారు. అయితే పేలుళ్ల నష్టంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ పేలుళ్లతో ముందస్తు చర్యల్లో భాగంగా లాహోర్ ఎయిర్‌పోర్టును మూసివేశారు. ఒక్కసారిగా పేలుళ్లు సంభవించడతో జనం భయంతో అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు.

## భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు

- ఇరాన్ విదేశాంగ మంత్రి ఢిల్లీకి చేరిక

**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):**
భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ దేశ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఇండియాకు వచ్చారు. ఇండియా, ఇరాన్ స్నేహ సంబంధాలు మొదలై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన భారత్‌కు విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న 20వ ఇండియా, ఇరాన్ జాయింట్ కమిషన్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్‌తో భేటీ- అవ్వనున్నారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ.. అరాగ్చీకి సాదర స్వాగతం పలికింది. ఈ నేపథ్యంలోనే జై శంకర్ తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో ' విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీకి సాదర స్వాగతం. ఆయన ఢిల్లీలో జరుగుతున్న ఇండియా, ఇరాన్ జాయింట్ కమిషన్ మీటింగ్‌లో పాల్గొనడానికి వచ్చారు. ఇండియా, ఇరాన్ స్నేహ సంబంధాలు మొదలై 75 సంవత్సరాలు అవుతోంది. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య సంబంధాలను రివ్యూ చేసుకుని, మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తాం' అని వెల్లడించారు. ఇక, ఈ కార్యక్రమం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరగనుంది. పలు కీలక విషయాలపై రెండు దేశాల మంత్రులు చర్చించే అవకాశం ఉంది. ట్రేడ్, ఎనర్జీ, కనెక్టివిటీ-తో పాటు- రీజనల్ కోఆపరేషన్‌పై చర్చ జరగనుంది. కాగా, అరాగ్చీ ఇరాన్ విదేశాంగ మంత్రిగా 2024లో బాధ్యతలు చేపట్టారు. విదేశాంగ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇండియా రావటం ఇదే మొదటి సారి. ఈ రోజు జాయింట్ కమిషన్ మీటింగ్ అయిపోగానే ఆయన రాష్ట్రపతి భవన్ వెళ్లనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవనున్నారు.

# పాక్‌తో సరిహద్దుల వద్ద గట్టి నిఘా

- రాజస్థాన్ సరిహద్దు మూసివేత
- వ్యతిరేక పోస్టులపై అప్రమత్తంగా ఉండాలని కేంద్రం హెచ్చరిక



**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):**
ఆపరేషన్ సిందూర్ తరవాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. నివురు గప్పిన నిప్పులా పరిస్థితి ఉంది. పాక్ ప్రతి దాడులకు పాల్పడుతుందనే సమాచారం మేరకు భారత్ అప్రమత్తం అయ్యింది. దాడులను ధీటుగా తిప్పికొట్టేందుకు సైన్యం సన్నద్ధంగా ఉంది. ఇకపోతే పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకొంటున్న రాష్ట్రాల్లో భద్రతా చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్ల మేరకు ఉన్న పాక్ సరిహద్దును సీల్ చేశారు. ఎవరైనా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా వ్యవహరిస్తే.. కాల్చివేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక భారత వాయుసేన కూడా పూర్తి అప్రమత్తంగా ఉంది. మే 9వ తేదీ వరకు జోధ్‌పుర్, బికనేర్, కిషన్‌ఘర్ విమానాశ్రయాలను మూసివేశారు. గగనతలంలో యుద్ధవిమానాల గస్తీ కాస్తున్నాయి. ఇక్కడ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను యాక్టివేట్ చేశారు. ఇక పంజాబ్‌లో ప్రభుత్వం కీలక చర్యలు తీసుకొంది. సరిహద్దుల్లోని ఆరు జిల్లాల్లో పాఠశాలలను మూసివేసింది. వీటిల్లో ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, ఫజ్లికా, అమృత్‌సర్, గురుదాస్‌పుర్, తార్న్ తరన్ ప్రాంతాల్లో 72 గంటలపాటు- స్కూళ్లను మూసివేశారు. రాష్ట్ర పోలీస్‌శాఖ, ఇతర దళాల్లో సెలవులను రద్దు చేసి.. సిబ్బంది తక్షణమే విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్లో నేడు కూడా పాకిస్థాన్ దళాలు శతఘ్ని గుండ్లను కాలుస్తున్నాయి. దీంతో మన సైన్యం దీటుగా బదులిస్తోంది. పౌర నివాసాలే లక్ష్యంగా పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది. ఇప్పటికే వీటిల్లో ఒక జవాన్ సహా 13 మంది చనిపోయారు. మంగళవారం రాత్రి అందరూ నిద్రపోతున్నవేళ.. క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్‌తో పాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో విరుచుకుపడింది. సరిహద్దుకు ఆవల 100 కిలోమీటర్ల దూరం వరకూ వెళ్లి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చింది. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకుంది. సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతిరేక ప్రచారంపై నిఘా ఉంచాలని కేంద్ర హోంశాఖ పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పలు రాష్ట్రాల సీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో హోం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలకు పలు సూచనలు చేసినట్లు అధికార వర్గాలు గురువారం తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తోంది. ఈక్రమంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హోంశాఖ పలు సూచనలు చేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి, భారత్ భద్రత గురించి తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే ఖాతాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దేశం నుంచి లేదా విదేశాల నుంచి భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ఆయా సోషల్ మీడియా ఖాతాలను వెంటనే బ్లాక్ చేయాలని పేర్కొంది. ఈసందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లోని ప్రభుత్వాలకు, భద్రతా దళాలకు మధ్య కమ్యూనికేషన్ సంబంధాలు పెంచాలని పిలుపునిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వేళ.. పాకిస్థాన్‌తో పాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ విరుచుకుపడింది. అక్కడి 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. 80 మంది ఉగ్రవాదులను హతమార్చి పహల్గాం దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.

# మద్యం స్కామ్ కేసులో నిందితులకు షాక్

- ధనుంజయ్ రెడ్డి తదితరులకు బెయిల్ తిరస్కరణ
- విచారణ ఈ నెల 13కు వాయిదా వేసిన సుప్రీం



**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):**
ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులకు సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసులో నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ ముగ్గురికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఈ కేసులో వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ ముగ్గురికి మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. ఈ కేసు మొదలైనప్పుడే ఈ ముగ్గురు కూడా ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు వచ్చారు. అయితే దీనికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. అక్కడ న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఇక్కడకు రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ పార్థివాలా, జస్టిస్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు చేసింది. ఈ క్రమంలో బుధవారం ఈ ముగ్గురు నిందితులు వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణకు వచ్చింది. కానీ వీరికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. దాంతో ఈరోజు సుప్రీం కోర్టు ముందుకు వచ్చిన ముగ్గురు నిందితులు.. హైకోర్టు నిరాకరించినందుకు తమకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని వినతి చేశారు. ఏపీ హైకోర్టులో వీరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించినందున.. హైకోర్టులో పెండింగ్‌లో ఉండగానే సుప్రీంలో దాఖలైన ఈ పిటిషన్ నిరర్థకమైందని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో గతంలో వేసిన పిటిషన్‌ను సవరణ అయినా చేయాలి లేదా కొత్త పిటిషన్ అన్నా దాఖలు చేయాలని.. అంతవరకు దీనిని అనుమతించవద్దని ముకుల్ రోహత్గీ చెప్పారు. రోహత్గీ వాదనలతో ఏకభవించిన కోర్టు.. గతంలో వేసిన పిటిషన్‌ను సవరించి మరో పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. అయితే 13 వరకు తమను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని ముగ్గురి తరపున వాదించిన న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. కానీ మధ్యంతర రక్షణ కల్పించేందుకు కూడా సుప్రీం కోర్టు నిరాకరించింది. అప్పటి వరకు మిమ్మల్ని మీరే కాపాడుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. మధ్యంతర బెయిల్‌పై మళ్లీ పిటిషన్ దాఖలు చేసిన తర్వాత 13వ తేదీన సుప్రీం కోర్టు విచారణ జరిపి మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

వెలుతురు
హైదరాబాద్
https://epaper.velthuru.com
శుక్రవారం 9 మే 2025

# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన...



**కూకట్ పల్లి మే 8 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని శ్రీనివాస్ నగర్, మెడికల్ సొసైటీ, వివేకానంద నగర్ కాలనీ, ఆల్విన్ కాలనీ 1వ ఫేస్ లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పైపు లైను పనులకు 35 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ తో కలిసి గురువారం కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రోజా దేవి మాట్లాడుతూ వర్షాకాలం రాకముందే వీలైనంత త్వరగా నాణ్యత ప్రమాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ బి మేనేజర్లు ప్రియాంక, ఝాన్సీ, సీనియర్ నాయకులు గొట్టుముక్కల పెద్ద భాస్కరరావు, ఆల్విన్ కాలనీ 1వ, ఫేస్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, కమల ప్రసన్న నగర్ అధ్యక్షులు చంద్రశేఖర్, మాధవరం నగర్ కాలనీ అధ్యక్షులు రమణారెడ్డి, ఆంజనేయులు, జగదీష్ గౌడ్, రాఘవులు, మోహన్ రావు, సత్యనారాయణ, విద్యాసాగర్, వెంకటేశ్వరరావు రామచందర్, శ్యామ్ రావు, బాబు, రమేష్ రావు,రాజు, సోమేశ్, సుబ్బారావు, బండప్ప, కనకయ్య, యాదయ్య, కుమార్, మాధవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మే 20 న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చెయ్యండి...

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్




**కూకట్ పల్లి మే 8 వెలుతురు:**
కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాలో మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చెయ్యాలని వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడాతు దేశంలోనీ అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల కు నష్టం చేసే 4లేబర్ కోడ్ లను రద్దు చెయ్యాలని, రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను అమలు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం నీ డిమండ్ చేసారు. కార్మికులకు కనీస వేతనం దేశంలో అందరికీ సమాన పని కీ సమాన వేతనం గా 26000రు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం లకు కొమ్ము కాస్తూ వారి ప్రయోనాల కోసం కార్మికులను బానిసలుగా చెయ్యడం కేంద్ర ప్రభుత్వం వక్రా బుద్ధి స్పష్టంగా అర్థం అవుతుంది అని ఆవేదన వ్యక్తం చేసారు. కార్మికులు అందరూ ఐక్యంగా మే 20 న జరిగిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సంఘటిత, అసంఘటిత, రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను కోరారు.ఈ కార్యక్రమం లో కుమార్, గణేష్, సత్యనారాయణ రెడ్డి,బాబురావు, రహీమ్, వినేష్ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు ఇబ్బంది లేకుండా రహదారికి మరమ్మత్తులు చేపట్టాలి..


- కార్పొరేటర్ దొడ్డ వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి మే 8 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఉషా ముళ్ళపూడి ప్రధాన రహదారి లోని తులసివనం వద్ద ఉన్న కాల్వర్టర్ వంతెనపై గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందిగా ఉందన్న విషయాన్ని తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం సమస్యను స్వయంగా పరిశీలించి వెంటనే ప్యాచ్ వర్క్ చేసి గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. బ్రిడ్జి మీద వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానం


**వెలుతురు న్యూస్, చౌటుప్పల్, మే 8 :**



మున్సిపల్ పరిధి తంగడపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సిలువేరు మేఘన 542, కొయ్యడ పూజ 523, మారగోని పూజ 503, బోల్లమోని పూజిత 501, MD హమేర 501, వీరితోపాటు 450 మార్కుల నుండి 500 వరకు వచ్చిన 26 మంది విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు D. భార్గవి ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది . ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని మంచి ఉద్యోగాలు సంపాదించాలని, మెరుగైన జీవితం కొనసాగించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్ళు, ఉపాధ్యాయులు నరసింహ, సరళ, మంగ, మహేశ్వరి, లింగయ్య, ప్రతిమ, యాదయ్య, శ్రీనివాసులు, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు .

# ఈనెల 11న తుర్కపల్లి భూలక్ష్మి దేవి మహాశివుని జాతర మహోత్సవాలు







**వెలుతురు నారాయణఖేడ్ మే 08 .**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో వెలసిన భూలక్ష్మి దేవి మహా శివుని జాతర ఉత్స వాలు ఆదివారం నుంచి అంగరంగ వైభోగంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు భూ లక్ష్మిదేవి శివుని పూజ, నైవేద్యా సమర్పణ, కార్యక్రమం 12 గంటల వరకు నిర్వహిస్తారు. సాయంత్రం 4, గంటలకు బండ్ల ఊరేగింపు రాత్రి 9,గంటలకు బోనాల ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం భజన, కీర్తనలు ఉంటాయి. 2.వ రోజు ఉదయం సోమవారం పాచిబండ్ల ప్రదర్శన తర్వాత నిండు జాతర సాయంత్రం 4, గంటలకు కుస్తీపోటీలు నిర్వహించనున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం చుట్టుపక్కల గ్రామాలతో పాటు కామారెడ్డి, జిల్లా పిట్లం మండలం ధర్మారం, గ్రామం నుండి 20ఎడ్ల బండ్ల, మనూరు మండలం ఎలుగొయి నుంచి 50 ఎడ్ల పండ్లు,ఇంకా చుట్టుపక్కల గ్రామాలు తండాల నుండి 150 వరకు ఎడ్ల బండ్లు ట్రాక్టర్లు ఈ జాతర ప్రదర్శనలో పాల్గొనడం జరుగుతోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మనుర్ మండలం: ఎల్గోయి గ్రామం నుండి దేవత రూపంతో నారాయణఖేడ్ మండల్ తుర్కపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి వారి ఇంటికి రాగా వారు గ్రామస్తుల సహకారంతో ఇక్కడే ఆలయాన్ని నిర్మించి జాతర జరపడం ఆనవాయితీగా మారిందని అన్నారు. దాదాపు 100 సంవత్సరాల క్రితం స్వయంభువు అమ్మవారుగా వచ్చి తుర్కపల్లిలో వెలిసినట్లు పూర్వీకులు అంటుంటారు. ప్రస్తుతం పక్కనే శివుని గుడినీ సంగారెడ్డి జిల్లా రిటైర్డ్ సూపరిడెంట్ డాక్టర్ బోయిన విట్టల్ తన సొంత డబ్బులతో తన తల్లి గారైన కీర్తిశేషులు బోయిని లాలమ్మ గారి ఆశీస్సులతో నిర్మించారు. ఈ గుడి లక్ష్మీ మందిర్ పక్కనే నిర్మించారు. ఇక్కడే రెండు దేవతలు కొలువు తీరడంతో గత పది సంవత్సరాల నుండి జాతర ఇంకా పెద్ద ఎత్తున కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.



# పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించడానికి తక్షణం చర్యలు చేపట్టండి..

- మదర్సాలల్లో నివసించేవారిపై వివరాలు సేకరించాలి...
- తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరచారి.



**తిమ్మాపూర్ వెలుతురు మే 08:**
పహల్గం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించడానికి తక్షణం చేపట్టాలని , ఆ దిశగా జాబితా చేసి వారిపై చర్యలు తీసుకోవాలని , అలాగే తిమ్మాపూర్ మండలం లోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి మదర్సాలాల్లో నివసించే ఇతర రాష్టాలకు చెందిన వారి యొక్క పూర్తి వివరాల ను సేకరించేలా చర్యలు తీసుకోవాలని తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరచారి తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి కి గురువారం వినతపత్రం సమర్పించారు.బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తలు తహసీల్దార్ ను కలిసారు. ఇటీవల కాశ్మీర్ లోని పహల్గం జరిగిన ఉగ్రవాదుల దాడుల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఉగ్ర మూకలను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ పై అనేక చర్యలు చేపట్టిందన్నారు. అలాగే దేశంలో ఉన్న పాకిస్తానీలను గడువులోగా వెళ్ళిపోవాలని తెలియజేసిన కొంతమంది ఇక్కడే నివసిస్తున్నారని తెలిపారు. అలాంటి వారందరినీ గుర్తించి , జాబితా చేసి తక్షణం దేశం నుండి పంపించడానికి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, మండలాల్లో, గ్రామాల్లో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి పంపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు . అలాగే మదర్సాలలో వందల మంది నివాసం ఉంటున్నట్లు ఇంటలిజెన్స్ నివేదిక ఉన్న నేపథ్యం లో కరీంనగర్ కు దగ్గరగా హైవే కు ఆనుకొని ఉన్నటువంటి మండలం అయినందున అనుమానితుల కదలికలపై నిఘా ఉంచేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు వినతిపత్రం లో కోరారు. వివిధ గ్రామాల్లో గత ఇరవై ఏళ్ల క్రితం నుండి ఏర్పాటు చేసిన మదరసాల లో నివసించే తెలంగాణే తరుల వివరాలను సేకరించాలని కోరారు.భారత ప్రభుత్వం తో పాటుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తింపు లేకుండా నివసించే తెలంగాణేతరులను వెంటనే వారి ప్రాంతాలకు పంపించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన క్రమంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు వినతిపత్రం లో పేర్కొన్నారు. అనంతరం నూతనంగా తిమ్మాపూర్ భాద్యతలు తీసుకున్న తహసీల్దార్ ను శాలువాతో సన్మానం చేసారు. జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్, మల్లారెడ్డి, వేల్పుల ఓదయ్య, దుర్గుంటి శేఖర్ రెడ్డి, శాబోలు గణేష్, వేల్పుల అరవింద్ తదితరులు తహసీల్దార్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# ఆవుల శ్రీధర్ సోదరి ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 8**
మండలం నీర్నాముల గ్రామానికి చెందిన టిఆర్ఎస్ మండల సోషల్ మీడియా అధ్యక్షులు ఆవుల శ్రీధర్ సోదరి ఎంగేజ్మెంట్ కార్యక్రమం రామన్నపేట పట్టణ కేంద్రంలోని ఎమ్మెస్ గార్డెన్ లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, మాజీ మండల కోఆప్షన్ మెంబర్ ఎండి అమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, నాయకులు జంగిలి నరసింహ, ఆవుల నరేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం సతీష్, నాయకులు ముక్కామల సత్తయ్య, శేఖర్ రెడ్డి, చెల్లమల్ల గోవర్ధన్, ఎండి మోసబ్, సింగన బోయిన దశరథ, గొలుసుల సత్తయ్య ,నోముల పెద్ద శంకర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# దేశాన్ని, సైనికుల సాహసాన్ని కించపరుస్తూ, ఏగతాళి చేసేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత పై చట్టపరమైన చర్యలు తీసుకోండి

### బిజెపి శ్రేణులతో కలిసి కరీంనగర్ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి,




**కరీంనగర్ వెలుతురు మే 08:**
దేశాన్ని , సైనికుల సాహసాన్ని కించపరుస్తూ "ఆపరేషన్ సింధూర్" ను ఎగతాళి చేసే విధంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలనికోరుతూ గురువారం రోజున బిజెపి శ్రేణులతో కలిసిజిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కరీంనగర్



పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిలో 26 మందిని పొట్టన పెట్టుకున్న టెర్రరిస్టులకు గట్టిగా బుద్ధి చెప్పేందుకు భారత సైన్యం అత్యంత సాహసోపేతంగా ఆపరేషన్ సింధూర్ పేరిట దాయాది దేశంలోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేస్తే, దానిని తప్పుబట్టేవిధంగా ప్రొఫెసర్ సుజాత వ్యవహరించడం దుర్మార్గమని, ఇది ముమ్మాటికి దేశద్రోహమే నన్నారు. ఆపరేషన్ సింధూర్ చేపట్టిన భారత సైన్యాన్ని అభినందిస్తూ కులమతాలకు అతీతంగా భారతీయులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తుంటే, అర్బన్ నక్సలైట్లు జీర్ణించుకోలేక సోషల్ మీడియాలో పిచ్చి పిచ్చి కామెంట్లు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యురాలైన సుజాత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధి చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతే కాకుండా తక్షణమే ఆమెను సస్పెండ్ చేసి, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ,లేకుంటే భారత సైనిక శౌర్యపరాక్రమాలను కించపరిచేందుకు అర్బన్ నక్సలైట్లకు అనుమతిచ్చినట్టే అవుతుందని పేర్కొన్నారు. టెర్రరిస్టులు మారణాయుధాలతో మనపై దాడి చేస్తుంటే, ఇలాంటి అర్బన్ నక్సలైట్లు ఆయుధాలు వాడకుండానే అంతకన్నా ఎక్కువే దేశంపై, దేశ సమగ్రతపై దాడి చేస్తున్నారని , ఇలాంటి దేశద్రోహ చర్యలకు పాల్పడే అర్బన్ నక్సలైట్లను కాంగ్రెస్ పార్టీ దూరం పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలే కాంగ్రెస్ పార్టీని దూరం పెట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ వార్త విని పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేసే దిశగా భారత సైన్యం చేపట్టే ప్రతి చర్యకు ప్రజలు అండగా నిలవాల్సిన సమయంలో, సైనికుల మనోస్థైర్యం దెబ్బతినేలా వ్యవహరించడం ఎంత మాత్రం క్షమార్హం కాదన్నారు. పోలీస్ కమిషనర్ ని కలిసిన వారిలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు , మాజీ డిప్యూటీ మేయర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్, లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ కొలిపాక చంద్రమౌళి , నాయకులు లడ్డు ముందడ, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాతపై చర్యలు తీసుకోవాలని బిజెపి మహిళా మోర్చా ఆందోళన, దిష్టిబొమ్మ దహనం...

- "ఆపరేషన్ సింధూర్" పై ప్రొఫెసర్ సుజాత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. .
- భారత ఆర్మీ పోరాటాన్ని కించపరిచేలా , ఎగతాళి చేసేలా ప్రొఫెసర్ సుజాత వ్యాఖ్యలు ఉన్నాయి..
- ప్రొఫెసర్ సుజాతను సస్పెండ్ చేయాలి..
- బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ



**కరీంనగర్ వెలుతురు మే 08:**
దేశ ప్రజల మనోభావాలు దెబ్బ తినే విధంగా, సైనికుల సాహసాన్ని కించపరిచేలా , ఎగతాళి చేస్తూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రోజున బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో యూనివర్సిటీ వద్ద నిరసన ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహిళ మోర్చ జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ పెహల్గాంలో పాకిస్తాన్ ముష్కరులు ఒడిగొట్టిన దారుణానికి ప్రతీకారంగా "ఆపరేషన్ సింధూర్" పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యను యావత్ దేశ ప్రజలు హర్షిస్తుంటే, బాధ్యతయుత హోదాలో శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు సూరేపల్లి సుజాత సోషల్ మీడియా వేదిక అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ తోపాటు పాకిస్తాన్ భూభాగంలలోని లష్కరే తోయిబా, జేషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థల శిబిరాలను ధ్వంసం చేసి ఉగ్రవాదులను హతమార్చిన ఈ ఘటనను శ్లాఘిస్తు భారత సైనికుల సాహసాలను, త్యాగాలను స్మరించుకుంటున్నరని తెలిపారు. ప్రపంచదేశాలు సైతం ఉగ్రవాద నిర్మూలన విషయంలో భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు సంఘీభావంప్రకటిస్తున్నాయన్నారు. ఇలాంటి సమయంలోశాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత మాత్రం అందుకు భిన్నంగా సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్స్ దేశ సైనిక చర్యను అవమానించేలా ఉన్నాయన్నారు.. ఇవి ముమ్మాటికీ సైనికుల పోరాటాలను కించపరచడమేన న్నారు. ఉన్నతమైన ఉద్యోగంలో ఉంటూ ఆమె చేసిన పోస్టింగ్స్ ముమ్మాటికీ దేశద్రోహ చర్యలుగానే భావిస్తున్నామన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సైతం కేంద్రం తీసుకుంటున్న చర్యలకు మద్దతు పలుకుతూ సైనికులకు సంఘీభావం తెలుపుతూ కార్యక్రమాలు చేపడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ అడ్వైజరి కమిటీ సభ్యురాలుగానూ కొనసాగుతున్న సూరెపల్లి సుజాత మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సహించరాని విషయం అని పేర్కొన్నారు. గతంలోనూ సూరెపల్లి సూజాత నక్సల్స్ భావజాలానికి అనుకూలంగా మాట్లాడారనీ వివిధ సామాజిక మాధ్యమాల్లో ఆమె చేసిన పోస్టింగులు వివాదాస్పదమయ్యాయనే విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు .బాధ్యతాయుతమైన ప్రొఫెసర్ గా ఉంటూ సమాజానికి, విద్యార్థి లోకానికి ఆదర్శంగా ఉండాల్సిన సుజాత సమాజాన్ని తప్పుదోవపట్టించేలా, రెచ్చగొట్టేలా వ్యవహరించడమే కాకుండా తాజాగా సైనికుల వీరోచిత పోరాటాలను కించపర్చేలా వ్యవహరించిన నేపథ్యంలో ప్రొఫెసర్ సుజాత పై పై చట్టపరంగా చర్యలు తీసుకొని, సస్పెండ్ చేయాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం చౌటుప్పల్ నందు



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 8 :**
మండలం లోని చిన్న కొండూరు గ్రామంలోని రైతు వేదిక వద్ద మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు అధ్యక్షతన గురువారం రోజున రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రొఫెసర్. జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్. సుజాత, డాక్టర్. వాణిశ్రీ వ్యవసాయ%శీ%లో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే పద్ధతుల మరియు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుట అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, ఎరువులు పురుగు మందులు కొన్నపుడు వాటి రసీదులను పంట కాలం పూర్తి అయ్యేవరకు భద్రపరిచుకోవటం సాగునీటిని ఆదా చేసే మార్గాలను మరియు పంట మార్పిడి చెట్లను పెంచుట వరి, పత్తి పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ గురించి, మేలైన విత్తన వంగడాల గురించి పూర్తి సమాచారం వివరించడం జరిగింది. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ సీజనకు ముందే మహోత్తరమైన మంచి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా మంచి పరిణామం, శాస్త్రవేత్తలే రైతుల దగ్గరికి వచ్చి చేసే ఇటువంటి ప్రోగ్రాం రైతులకు బాగా ఉపయోగపడుతుంది గతంలో తంగేడు, జిల్లేడు ఆకులను వేసి కలియదున్ని భూసారాన్ని కాపాడుకునేవారు, ఇప్పటి పరిస్థితులుకు అనుగుణంగా జీలుగా జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులని ముందే కలియదున్ని భూసారాన్ని కాపాడాలి అని, ఆయిల్ ఫామ్ సబ్సిడీని ఉపయోగించుకోవాలని సూచించడం జరిగింది. కలుపు మందులకు బదులుగా కలుపుతీస్తేనే రైతులకు బాగా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో AMC వైస్ చైర్మన్, క్లస్టర్ పరిధిలో ఏఈవోలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు కాబట్టి వారి యొక్క సలహాలను సూచనలను పొందాలన్నారు.HO కవిత ఆయిల్ పామ్ సబ్సిడీ గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్, సంజీవరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, బక్క శ్రీనాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి పండుగ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 8**
మండలం సర్నేనిగూడెం గ్రామంలో బొడ్రాయి పండుగ మరియు గ్రామదేవతల పండుగలకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై గ్రామ దేవతల ఆశీస్సులు సర్నేనిగూడెం గ్రామం పై ఉండి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, భగవంతుని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు ధరణి రాణి, ఎడ్ల మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, వేమవరం సుధీర్, బాబు జిల్లా నాయకులు బద్దెల రమేష్, ఎస్.కె చాంద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు ధర్మే భాస్కర్, కార్యదర్శి నీల దామోదర్, నాయకులు మిర్యాల మల్లేశం, ఎడ్ల నరేందర్ రెడ్డి, మద్యపూరి ఐలయ్య, బొడ్డుపల్లి రాజు, కడారి మల్లేశం, పిట్ట మహేందర్ రెడ్డి, నోముల లింగస్వామి, జంగయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.



# కట్ట బాల్ రెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు - కోడలు కూతురు- అల్లుడు భార్య అమ్మానాన్న అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 8**
సిరిపురం గ్రామానికి చెందిన కట్ట బాల్ రెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్ధంగా అమ్మానాన్న అనాధాశ్రమం చౌటుప్పల్ నందు కుమారుడు –కోడలు కట్ట వెంకట నరసింహారెడ్డి మాలతి కుమార్తె– అల్లుడు అంబటి ఉపేంద్రమ్మ రవీందర్ రెడ్డి (సింగిల్ విండో వైస్ చైర్మన్ రామన్నపేట) భార్య కట్ట పుష్పమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో కూతురు గుత్త శాంతమ్మ, మనవడు గుత్తా శివమణి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ మాలమహానాడు అధ్యక్షుడిగా జువ్వి నరసింహ ఎన్నిక

- ప్రధాన కార్యదర్శిగా సంగం నరసింహులు



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 8 :**
పట్టణ కేంద్రం షాదిఖానలో చౌటుప్పల్ మండల మాల మహానాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మోజి గూడెం గ్రామానికి చెందిన జువ్వి నరసింహ, ఉపాధ్యక్షుడిగా జువ్వి రఘుపతి, సరిపెల్లి యాదయ్య, ప్రధాన కార్యదర్శి సంగం నరసింహులు, సహాయ కార్యదర్శులుగా కట్ట రత్నయ్య, దౌడీ యాదగిరి, జువ్వి శివ, చేపూరి వెంకటేశం, బుట్టి రాము, అనిమల్ల యాదయ్య సాంస్కృతిక కార్యదర్శిగా యనమల సంజీవ, ప్రచార కార్యదర్శిగా సాతిరి మధు, కోశాధికారిగా మండారి మార్కు, మరో పదిమంది మండల కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జువ్వి నరసింహ మాట్లాడుతూ చౌటుప్పల మండలంలో మాలలను చైతన్యం చేసి మాల మహానాడు బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన మాల మహానాడు కమిటీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చలనచిత్ర దర్శకుడికి ఘనంగా సన్మానం



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 8 :**
చౌటుప్పల్ పట్టణానికి చెందిన భారతీయ చలనచిత్ర దర్శకుడు, కీర్తిశేషులు దాదాసాహెబ్ ఆర్కే మెమోరియల్ అవార్డు అందుకున్న, నల్గొండ జిల్లా కెమిస్ట్రీ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిరందాస్ ధనుంజయ ని అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది బాల్యం వెంకటాచలం, గుర్రం వెంకటేశం లు కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ధనంజయ మాట్లాడుతూ తెలంగాణ బాపు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వారు జీవిత కాలంలో బడుగు బలహీన వర్గాలకు, మన ప్రాంత ప్రజలకు చేసిన సేవలు, తెలంగాణ మొదటి నుండి ఉద్యమానికి జీవం పోసిన కొండ లక్ష్మణ్ జీవితానికి సంబంధించిన డాక్యుమెంటరీ చిత్రం నిర్మించినందుకు నా యొక్క జన్మ ధన్యమైందని తెలియజేస్తూ త్వరలో పోచంపల్లి డిజైన్ల విషయంలో నైపుణ్యతను కలిగి ఆర్థికంగా లేక ఎంతోమంది నేత కార్మికులు మరుగున పడుతున్నారు, డాక్యుమెంటరీ చిత్రానికి ప్రయత్నం చేస్తున్నాం అని తెలియజేశారు.

# చిన్నారి నిహారిక కు సమ్మి గౌడ్ చిలువేరు ఆశీర్వాదం



**కేసముద్రం వెలుతురు మే 08:**
కేసముద్రం మండలం తాళ్ల పూస పల్లి గ్రామానికి చెందిన మెంచు పద్మ– వెంకన్న గౌడ్ దంపతుల కుమార్తె నిహారిక నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారి నిహారికను ఆశీర్వదించి నూతన పట్టు వస్త్రాలు బహూకరించి చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు తనకి మెండుగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆశీర్వదించారు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కిరణ్,కన్నయ్య,కొండేటి కళాధర్,గొడిషాల వెంకన్న,సునీత తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ గౌడ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎస్ దుర్గయ్య గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 08:**
గురువారం రోజున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ గౌడ్ గారి పుట్టిన రోజు సందర్భంగా, తెలంగాణ సెక్రటేరియట్ మంత్రి గారి ఛాంబర్ లో బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపడం జరిగింది,, ఈ సందర్భంగా బీసీ సమాఖ్య అధ్యక్షుడు ఎస్ దుర్గయ్య గౌడ్,బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు,సింగం నాగేష్ గౌడ్, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు మనిమంజరి, తారాకేశ్వరి, స్వర్ణ, గజ్జ శ్రీనివాస్, తదితరులు, పాల్గొన్నారు.

## అమ్రాబాద్ మండలం కుమ్మరోనిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక





**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**
అమ్రాబాద్ మండల పరిధిలోని కుమ్మరోళ్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ కమిటీని ఎన్నుకున్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మరియు అమ్రాబాద్ మాజీ తాజా జెడ్పిటిసి అనురాధ ఆదేశాల మేరకు నూతనంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకోవడము జరిగిందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. అధ్యక్షులుగా వెంకటాచలం ఉపాధ్యక్షులుగా బూరం మల్లయ్య యాదవ్, బండపల్లి బాలయ్య ప్రధాన కార్యదర్శిగా బాల్ చంద్రయ్య కోశాధికారిగా గుండాల సాయిలు సహాయ కార్యదర్శులుగా అవుట ప్రశాంత్, చింతల నాగేష్, ప్రచార కార్యదర్శిగా నిర్మల శ్రీనివాసులు కార్యదర్శులుగా మండలి రవికుమార్ కలుముల రామారావు ను ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో . మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటయ్య ఎన్ ఎస్ యు ఐ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు సంతోష్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బాలలింగం గౌడ్ డిసిసి కార్యదర్శి రేనయ్య జిల్లా ఎస్సీ సెల్ కోకొన్వీనర్ లింగం సింగిల్ విండో డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజారామ్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ తాలూక అధ్యక్షులు లడ్డు యాదవ్ యూత్ కాంగ్రెస్ అమ్రాబాద్ మండల అధ్యక్షులు శివ , యూత్ కాంగ్రెస్ తాలుక నాయకులు ఖైరత్, బీసీ సెల్ మండల అధ్యక్షులు జాల మల్లేష్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజీవ్ యువశక్తి ఇంటర్వ్యూలు వాయిద

- ఎంపీడీవో విజయ్ కుమార్



**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ :**
అమ్రాబాద్ మండల పరిధిలోని గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్నటువంటి బీసీ ఓసీ అభ్యర్థులకు రాజీవ్ యువశక్తి ఇంటర్వ్యూలు ఈనెల 9న నిర్వహించవలసి నటువంటి కార్యక్రమాన్ని వాయిదా వేశామని ఎంపీడీవో పి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువశక్తి ఇంటర్వ్యూలు జిల్లా కలెక్టర్ అత్యవసర సమావేశం కారణంగా వాయిదా వేయడం జరిగిందని ఆయన అన్నారు. ఇట్టి ఇంటర్వ్యూలను ఈనెల తేదీ 13 నాడు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాబట్టి ఇట్టి విషయాన్ని మండలంలోని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## భోగి గణేష్ జమున వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బోసుపల్లి ప్రతాప్

**రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 08:**
రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఎస్సిమోర్చా ప్రధానకార్యదర్శి భోగి గణేష్ , జమున వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర ఎస్సిమోర్చా కార్యదర్శి కొంద్రు పురుషోత్తం, రాష్ట్ర ఎస్సిమోర్చా కోశాధికారి బచ్చిగళ్ళ రమేష్ రంగారెడ్డి జిల్లా ఎస్సిమోర్చా అర్బన్ ప్రధాన కార్యదర్శి పారంద మహేష్ తదితరులు పాల్గొన్నారు



# కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నోటి దురుసు తగ్గించుకో

- రాజగోపాల్ రెడ్డి గారి పై నిరాధారమైన ఆరోపణ చేస్తే చూస్తూ ఊరుకోం
- కమిషన్లకు కక్కుర్తి పడి నాసిరకంగా క్యాంప్ కార్యాలయం కట్టించి, ప్రజాధనాన్ని జేబులో వేసుకున్నావ్
- ప్రజా సమస్యలు చర్చించడానికి వేదికైన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని తన సొంత నిధులతో ఆధునికరించిన గొప్ప మనసున్న వ్యక్తి రాజగోపాల్ రెడ్డి
- కుంభం శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్



**మునుగోడు వెలుతురు మే 08:**
మేము చేసిన అభివృద్ధి తప్ప కొత్తగా అభివృద్ధి ఏమి చేయలేదంటూ, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేసిన నిరాధారమైన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి... కోటి 60 లక్షల వ్యయంతో నాణ్యంగా నిర్మించాల్సిన అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కమిషన్లకు కుక్కర్తి పడి నాసిరకంగా నిర్మించారంటూ, నిర్మించి సంవత్సరం తిరగకముందే కిటికీలు దర్వాజాలు పాడై, స్లాబ్ నుంచి నీరు కారుతూ బిల్డింగ్ అంతా నేర్రలు బా రడంతో... ప్రజా సమస్యలు చర్చించే వేదిక ఇలా ఉండొద్దని తన సొంత డబ్బులతో అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆధునికరిస్తే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు... గత పది ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో మునుగోడు అభివృద్ధికి నోచుకోలేదని,, ప్రజలిచ్చిన పదవిని ఆ ప్రజల అభివృద్ధి కోసం త్యాగం చేసిన గొప్ప మనిషి రాజగోపాల్ రెడ్డి గారని అన్నారు... రాజీనామా దెబ్బతో ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల కాళ్ళ దగ్గరికి తీసుకొచ్చి అభివృద్ధి చేయించిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదన్నారు... ఆయన రాజీనామాతో గట్టుప్పల్ మండల్ ఏర్పాటు, చండూరు రెవిన్యూ డివిజన్ ఏర్పాటు, ప్రతి గ్రామానికి అభివృద్ధి నిధులు తీసుకొచ్చిన విషయం మరువొద్దన్నారు... టిఆర్ఎస్ పాలనలో మంజూరై పనులైన వాటికి బిల్లులు చెల్లించకపోతే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు ఇప్పించి అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్న ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మునుగోడుని సర్వతోముకాభివృద్ధి అభివృద్ధి పరచాలని అనునిత్యం తపిస్తున్న వ్యక్తిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు... టిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో చేపడుతున్న రిజర్వాయర్లకు నీటిని ఎక్కడ నుంచి తరలించాలి అని ఆలోచనకూడా చేయకుండా పనులను పెండింగ్ పెట్టారని... ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏదుల రిజర్వాయర్ నుండి మునుగోడు నియోజకవర్గం లోకి నీరు వచ్చే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పించి 1800 కోట్ల నిధులను మంజూరు చేయించిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారి దేనని మరువద్దన్నారు... బ్రాహ్మణ వెల్లాంల ప్రాజెక్టు నుండి మునుగోడు మండలం సస్యశ్యామలం చేయడానికి రిటైర్డ్ ఇంజనీర్లతో పలుమార్లు సమీక్ష నిర్వహించి మునుగోడు మండలాన్ని సస్యశ్యామలం చేయడానికి బృహత్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని... ఒక మునుగోడు మండలమే కాకుండా వర్షపు నీటిని ఒడిసి పట్టి చెరువులకు మళ్ళించేలా, ఫీడర్ ఛానల్ ను చెరువుల ను అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తున్నారని గుర్తు చేశారు... ఎప్పుడో గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకొని 3.5 మీటర్ల ఉన్న రోడ్డు వెడల్పును, 5.5 మీటర్లకు మార్చి ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే విధంగా ముఖ్యమంత్రిని మంత్రులను ఒప్పించిన ఘనత రాజగోపాల్ రెడ్డి గారిదన్నారు. విద్య వైద్యం సాగునీరు త్రాగునీరు రోడ్లు విద్యుత్తు అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తెలంగాణ రాష్ట్రంలోనే మునుగోడును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి అనునిత్యం కష్టపడుతున్న రాజగోపాల్ రెడ్డి గారిని విమర్శించే నైతిక హక్కు మీకు లేదు. మీ పాలనలో ప్రజా సంక్షేమ పథకాలన్ని కూడా గులాబీ కండువ వేసుకున్న వాళ్ళకి ఇచ్చారు... కానీ మా ప్రజా ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారు రాజగోపాల్ రెడ్డి పదవి పోగొట్టుకొని బాధలో మాట్లాడుతున్న మీరు మరోసారి రాజగోపాల్ రెడ్డి గారి పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు...

# తెలుగు భాష రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో భాగం కావాలి

### త్వరలో 10,000 మందితో ఎల్బీ స్టేడియంలో తెలుగు భాషా అభిమానుల సదస్సు

### తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవ వేడుకల్లో వక్తలు.



**హైదరాబాద్ వెలుతురు మే 08:**
"తెలుగు భాషకు పట్టాభిషేకం" పేరుతో తెలుగు భాష చైతన్య సమితి 12వ వార్షికోత్సవ వేడుకలు త్యాగరాయ గాన సభలో గురువారం రోజున వేడుకగా జరిగాయి.




రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షత వహించిన ఈ సభలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ పుష్కరకాలంగా తెలుగు భాషా చైతన్య సమితి తెలుగు భాష చైతన్యం కోసం చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరంగా ప్రసంగించారు. స్వచ్ఛందంగా తెలుగు భాషా చైతన్య సమితి భాష కోసం శ్రమిస్తున్నదని పాఠశాలలో కళాశాలలో భాషా కార్యక్రమం ఏర్పాటు చేసి తనను కూడా అందులో భాగస్వామి చేసిందని, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులను అభినందించారు. సంస్కృతం మార్కుల కోసం కాకుండా భాష పై పట్టు సాధించడం కోసం చదువుకోవాలని, సంస్కృతాన్ని సంస్కృతం లోనే పరీక్షలు రాయాలని సూచించారు. మరో ప్రత్యేకత ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ సజీవంగా జీవిస్తున్న భాషకు విఘాతం కలిగిస్తే చైతన్యవంతం కావాల్సిన సూచన ఈ సభ చేసిందని, అవసరం కోసం ఏ భాష నేర్చుకున్న తెలుగు మరువకూడదని అన్నారు.

సదస్సులో పాల్గొన్న మరొక అతిథి ఆచార్య కాసిం మాట్లాడుతూ ఉపాధినిచ్చిన తెలుగు భాషకు సేవ చేసే ఉద్దేశంతో తెలుగు భాష చైతన్య సమితి సభ్యులంతా తెలుగు భాష కోసం కృషి చేస్తున్నారని అన్నారు. తెలుగు భాషకు చేసిన కృషిని గురించి చెప్పాడు. భాషను బతికించాలన్న, భాషను చావగొట్టాలన్న మార్కెట్, భావజాలం రెండు ప్రధానమైన వని, నేడు తెలుగు భాష ప్రమాదంలో ఉందని, అందరం ఒక తాటిపై నిలబడి తెలుగు భాష కోసం పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అలాగే రాజకీయ నాయకుల మేనిఫెస్టోలో తెలుగు ప్రధాన అంశంగా ఉండాలని, అందుకోసం త్వరలో 10,000 మందితో ఎల్బీ స్టేడియంలో సదస్సు నిర్వహించాలని అన్నారు. అప్పుడే రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో తెలుగును ప్రధాన అంశంగా స్వీకరిస్తాయని చెప్పారు.

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్త మాట్లాడుతూ డిగ్రీ లో బిఎ తెలుగు కోర్స్ పెట్టినట్టుగా తెలిపారు.

సదస్సులో అనేకమంది భాషాభిమానులు ఉపాధ్యాయులు కవులు పాల్గొని తెలుగు భాషాభివృద్ధికి తెలుగు భాషా పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలు చెప్పారు. అలాగే మూడు వేదికలో జరిగిన కవి సమ్మేళనంలో 300 మంది కవులు పాల్గొని తెలుగు భాష గురించి,ఇతర అంశాల గురించి తమ కవితలని వినిపించారు.

తెలుగు భాష చైతన్య సమితిని చేస్తున్న కార్యక్రమాల్ని మరింత విస్తృత పరుస్తూ భాషా సేవను కొనసాగించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

ఈ సభలో తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలా చారి, తదితరులు పాల్గొన్నారు.

సదస్సు తీర్మానాలు:
- ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలి.
- డిగ్రీ వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తూ ప్రథమభాషగా బోధించాలి.
- రాష్ట్రంలోని సిబిఎస్ఈ వంటి ఇతర అన్ని బోర్డుల్లో తప్పనిసరి తెలుగు ఖచ్చితంగా అమలుచేయాలి.
- రాష్ట్రంలోని అన్ని మేనేజ్మమెంట్లలోని జూనియర్ కళాశాలల్లో, డిగ్రీ కళాశాలల్లో ఖచ్చితంగా తెలుగు అధ్యాపకులు, తెలుగు సెక్షన్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- అన్ని ప్రైవేటు యాజమాన్యాలు తమ కళాశాలల్లో తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- విశ్వవిద్యాలయ స్థాయి (పీజీ) తెలుగు బోధనలో... ఉపాధి ఆధారిత విద్యాబోధన జరగాలి. తదనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన జరగాలి.
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని పరీక్షల్లో తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- గ్రూప్–1 లో ఇంగ్లీష్ వలె తెలుగు కూడా క్వాలిఫైయింగ్ సబ్జెక్ట్ గా ఉండాలి.
- జనరల్ స్టడీస్ లో కనీసం 20 శాతం ప్రశ్నలు తెలుగుకు కేటాయించాలి.
- తెలుగు మీడియంలో పరీక్షలు రాసే విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వాలి.
- ఎంబిబిఎస్, బి.టెక్ వంటి కోర్సుల్లో తెలుగును మైనర్ సబ్జెక్ట్ గా ప్రవేశపెట్టాలి.
- రాష్ట్రంలో పనిచేస్తోన్న ఇతర రాష్ట్రాలవారు తప్పనిసరిగా తెలుగు నేర్చుకునేలా చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో సభా నిర్వహణ పీ బడే సాబ్ ప్రజ్ఞా రాజు లక్ష్యాలను ఫౌండేషన్ చైర్మన్, డాక్టర్ జయప్రకాష్, అవ మల్లయ్య డాక్టర్ ఎడ్ల కల్లేష్, కే సత్యనారాయణ, ఎల్ జగన్, ముగింపు కార్యక్రమంలో, డాక్టర్ బాలా చారి సైత అకాడమీ కార్యదర్శి, డాక్టర్ నాలేశ్వరం శంకరం తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు, డాక్టర్ బి జయ రాములు, వాళ్ల రామకృష్ణ, డాక్టర్ రాధాకుసుమ, పివిపి అంజని కుమారి, కె.వి జనార్ధన్, డాక్టర్ బి రాజారత్నం, అర్థ చంద్రప్రకాష్ రెడ్డి, గంట మనోహర్ రెడ్డి, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ 20 సాహితి సంస్థల అధినేతలు పాల్గొని సభను విజయవంతం చేశారు

## జూన్ నుంచి కొత్త రేషన్ కార్డులు

**విజయవాడ, మే 8 ( వెలుతురు)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తకార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు చేర్పులపై కదలిక మొదలైంది. నూతన రైస్ కార్డుల జారీ, మార్పులు చేర్పులకు సంబంధించి మొత్తం ఆరు రకాల సేవలు బుధవారం నుంచి ప్రారంభం అవుతాయి. ఈ మేరకు రాష్ట్ర ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన జారీ చేశారు.కొత్త రైస్ కార్డుల జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యులను చేర్చడం, ఉన్న వారిని తొలగించడం, కార్డులను సరెండర్ చేయడం ఇలా ఆరు రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వారం రోజుల తుదుపరి వాట్సాప్ గవర్నెన్సు ద్వారా కూడా ఈ సేవలను



నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. జూన్ మాసంలో స్మార్టు కార్డుల రూపంలో నూతన రైస్ కార్డుల జారీకి సన్నాహాలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నాల్గోబ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ 2024 ఎన్నికల వల్ల నూతన కార్డుల జారీని నిలిపేశారని చెప్పారు. ఆ తర్వాత ఈకేవైసీ తప్పని సరిగా నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగా కొత్త కార్డుల జారీ ఆలస్యమైందన్నారు. ఇప్పటి వరకు 94.4 శాతం మేర ఈకేవైసీ ప్రక్రియ పూర్తైంది. అందుకే నూతన రైస్ కార్డుల జారీకి అవకాశం కల్పించామన్నారు. రాష్ట్రంలో మొత్తం 1,46,21,223 రైస్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా దాదాపు 4,24,59,028 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు, 80 సంవత్సరాలు పైబడిన వారికి ఈకేవైసీ చేయాల్సిన అవసరం లేదనే వెసులుబాటు కల్పించామని వివరించారు. దీని వల్ల దాదాపు 6,45,765 మంది దూరంగా ఉన్నారని తెలిపారు. అదే విధంగా ఇప్పటికే 3,94,08,070 మంది తమ రైస్ కార్డులో మార్పులు చేర్పుల కోసం నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది జూన్ మాసంలో క్యూఆర్ కోడ్తో స్మార్టు రైస్ కార్డులు జారీ చేస్తారు. ఆ కార్డులపై కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఉంటాయి. ఆ కార్డును స్కాన్ చేయగానే అన్ని వివరాలు కనిపిస్తాయి. డేటా బేస్‌కి ఈ కార్డును లింక్ చేయడం వల్ల సిస్టమ్‌లో ఆటోమేటిక్‌గా అప్డేట్ అవుతుంది.

## జమ్మూ లక్ష్యంగా పాక్ దాడులు


- అప్రమత్తం అయిన రక్షణ దళాలు




**న్యూఢిల్లీ,మే 8( వెలుతురు):**
భారత్– పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజాగా జమ్మూ లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లతో దాడులకు యత్నిస్తున్నట్లు– జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. జమ్మూలోని ఓ ఎయిర్ స్ట్రిప్‌ను పాక్ లక్ష్యంగా చేసుకున్నట్లు– తెలుస్తోంది. మరోవైపు సాంబా జిల్లాలో పాక్ రేంజర్లు భారీఎత్తున కాల్పులకు తెగబడుతున్నట్లు– సమాచారం. పలుచోట్ల భారీగా సైరన్ శబ్దాలు వినిపిస్తున్నాయి. కిష్త్వార్, అఖ్నూర్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ప్రజలంతా ఇళ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీచేసింది.

## దేవుడా మా దేశాన్ని కాపాడు


- పాక్ ఎంపి వేడుకోలు వీడియో వైరల్



**న్యూఢిల్లీ,మే 8( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన భారత్.. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దాయాది దేశం.. భారత్‌పై దాడులకు విఫలయత్నం చేస్తోంది. పాక్ దాడులను భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థలనూ ధ్వంసం చేశాయి. ఈ పరిణామాల నడుమ పాక్ పార్లమెంటులో ఓ సభ్యుడు చేసిన వ్యాఖ్యల వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తమ దేశాన్ని కాపాడాలంటూ దేవుడిని వేడుకుంటున్నట్లు అందులో కనిపిస్తోంది. మన దేశం బలహీనంగా ఉంది. అందుకే ఈ దేశాన్ని కాపాడాలంటూ మనమంతా ఆ దేవుడిని ప్రార్థిద్దాం అంటూ ఎంపీ, విశ్రాంత సైనికాధికారి మేజర్ తాహిర్ ఇక్బాల్ పార్లమెంటు వేదికగా విజ్ఞప్తి చేశారు. మేం నిస్సహాయ స్థితిలో ఉన్నాం. నీ దయ ఉంటే మేం విజయం సాధిస్తాం. ఈ దేశాన్ని రక్షించు. శత్రువును ఓడించే బలాన్ని ఇవ్వు అంటూ ప్రార్థించారు. ఈ వీడియో కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భారత్ నుంచి వరుస పరాభవాలు ఎదురవుతున్న వేళ పాకిస్థాన్‌లో నెలకొన్న తాజా పరిస్థితులను ఈ వీడియో చాటుతోందని పలువురు నెటిజన్లు పేర్కొన్నారు.

## బలూచీలో ఊపందుకున్న స్వాతంత్ర్య పోరాటం

- పాక్ జెండాలు తొలగించి బలూచీ జెండాలు ఎగరవేత




**లాహోర్,మే 8( వెలుతురు):**
పాకిస్తాన్ లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో స్వాతంత్య్ర పోరాటం మరోసారి తెరపైకి వచ్చింది. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇందుకు తన కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నట్లు– తెలుస్తోంది. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వానికి మరో కొత్త సవాళు ఎదురయ్యే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. భారత్ – పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న పరిస్థితిలో ప్రస్తుత పరిస్థితులను బీఎల్ఏ తమకు అనుకూలంగా మార్చుకుంటూ తమకు ప్రత్యేక దేశం కావాలని డిమాండ్‌ను బలంగా వినిపిస్తోంది. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు పాకిస్తాన్ జెండాను తొలగించి, వాటి స్థానంలో బలూచిస్థాన్ జెండాలను ఎగురవేస్తున్నారు. అంతేకాకుండా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇదివరకే తమకు ప్రత్యేక దేశం కావాలని పాకిస్థాన్ సైనికులపై దాడులు చేసింది. ఒక పక్క భారత ప్రతీకారుల దాడులతో ఒణికిపోతున్న పాకిస్తాన్‌కు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ తమ ఆందోళనతో పాక్‌ను మరింత ఉక్కిరిబిక్కిరి చేసేలా కనిపిస్తుంది.

## నీళ్లు లేకుండా వరి

**హైదరాబాద్, మే 8 వెలుతురు**
వరి సాగులో హైదరాబాద్ శాస్త్రవేత్తలు అద్భుతం చేశారు. కరువును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వంగడాలను సృష్టించారు. ధన్ 100 వరి రకం 30శాతం అధిక దిగుబడినిస్తుందని రాజేంద్రనగర్ ఐఐఆర్ఆర్ తెలిపింది. ఈ పూసా రైస్ డీఎస్‌టీ1 గా చెప్పుకునే వరివంగడం కరువు, చౌడును తట్టుకుని నిలబడుతుంది. అన్నింటికంటే ఇది 20 రోజులు ముందే చేతికొస్తుందని, ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు క్రిస్పర్%–%కాస్9 అనే జీనోమ్%–%ఎడిటింగ్ సాంకేతికతతో అభివృద్ధి చేసిన రెండు వరి వంగడాలను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆవిష్కరించారు. ఇది ప్రపంచంలోనే తొలి జన్యు సవరణ వరి రకంగా పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, భూతాపం తట్టుకుని అధిక దిగుబడిని ఇస్తుందని చెప్పారు. 'దేశంలో ప్రజాదరణ పొందిన సాంబ మసూరి వంగడానికి జన్యుసవరణ చేసి ధన్ 100 (కమల)' రకాన్ని అభివృద్ధి చేశాం. 'క్రిస్పర్'ను వినియోగించి సాంబ మసూరిలోని సైటోకినిన్ ఆక్సిడేస్ జన్యువుకు సవరణ చేశాం. సుమారు 3 ఏళ్లు పట్టింది. 2 ఏళ్లు వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరీక్షలు చేశాం. ప్రస్తుతం మావద్ద ఈ రకానికి సంబంధించి మూల విత్తనాలు ఉన్నాయి. విత్తనాల విడుదలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. 19 శాతం పెరుగుదలతోపాటు 20 రోజుల ముందే పరిపక్వతకు వచ్చింది. ఈ వరి బలమైన కాండాలను కలిగివుండటంతో కరువును తట్టుకుని నిలబడుతుంది' అని డాక్టర్ సతేంద్ర కుమార్ మంగ్రౌతియా స్పష్టం చేశారు.

# అడ్డంగా బుక్ చేస్తున్న షీ టీమ్స్...

**హైదరాబాద్, మే 8, ( వెలుతురు)**
దేశంలో ఎన్ని కఠిన చట్టాలు అమలు చేస్తున్నా లైంగిక వేధింపులు ఆగట్లేదు. 90శాతం మహిళలపైనే కామాంధులు లైంగిక దాడికి పాల్పడుతున్నారు. పసి పిల్లల నుంచి ముసలమ్మలదాకా వయసుతో సంబంధం లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో డేటింగ్, లివింగ్ రిలేషన్ పేరిట దారుణాలు జరుగుతున్నాయి. తాజాగా బయటపడిన కొన్ని ఘటనలపై షీ టీమ్స్ ప్రత్యేక దృష్టిపెట్టాయి. 100 మందికిపైగా నిందితులను పక్కా ఆధారాలతో పట్టుకుని శిక్షలు విధిస్తున్నాయి.

**నగ్న వీడియోలు తీసి బ్లాక్ మెయిల్..**
హైదరాబాద్‌లో ఓ వ్యక్తికి ఫేస్ బుక్ లో పరిచమైన మహిళతో అక్రమ సంబంధం కుదిరింది. దీంతో ఆమెను ఓయో రూమ్ కు తీసుకెళ్లి, నమ్మించి నగ్నంగా ఉన్నప్పుడు వీడియోలు చిత్రీకరించాడు. ఆ తర్వాత ఆమె నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతోపాటు తనకు కావాల్సినప్పుడు రావాలని బెదిరించాడు. మరింతమంది స్త్రీలను శృంగారంలో కోసం పపించాలని వేధించాడు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. షీ–టీమ్స్ బృందాలు అరెస్ట్ చేసినట్లు డీసీపీ డాక్టర్ ఎన్‌జేపీ లావణ్య తెలిపారు. నిదింతుడికి 3 రోజుల జైలు శిక్ష వేశారు.

**పోలీసులకే షాక్ ఇచ్చిన యువతి..**
ఇలాంటిదే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. బేగంపేటకు చెందిన ఓ యువతి తన ఫ్రెండ్స్ తో కలిసి పార్టీ చేసుకుంది. అయితే ఇదంతా రహస్యంగా వీడియో తీసిన పక్క ఇంట్లో ఉండే యువకుడు.. ఆమెను బ్లాక్ మెయిల్ చేశాడు. తనతో పడుకోవాలంటూ వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు చేయడంతో షీ%–%టీమ్స్ నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 4 రోజుల జైలు శిక్ష విధించింది న్యాయస్థానం. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దగ్గర ఉండే ఓ యువతి గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడి చేశాడంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కానీ విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడడ్డాయి. పోలీసులనే టార్గెట్‌చేసిన యువతి వారి ఫోన్లు తీసుకుని అశ్లీల చిత్రాలను తన నెంబర్‌కు పంపించుకుంది. ఆ తర్వాత పోలీసులనే బెదిరించగా ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

**చెత్త బండి డ్రైవర్ పిచ్చి చూపులు..**
హైదరాబాద్‌లో ఇది అత్యంత దారుణమైన కేసు. ఇంటి చెత్త సేకరించే ఆటో డ్రైవర్ ఓ మహిళను లైగికంగా వేధించాడు. అసభ్యంగా మాట్లాడటం, ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో బాధితురాలు షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసింది. డెకాయ్ ఆపరేషన్ చేసిన అధికారులు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా 4 రోజుల జైలు శిక్ష వేసింది. మరో కేసులో ప్రేమ పేరుతో బాలికను ట్రాప్ చేసిన దుర్మార్గుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, మాదన్నపేట, ఛత్రినాకలో బాలికలను వేధిస్తున్న గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోచోట పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కోరిక తీరగానే మొహం చాటేసిన యువకుడిపై షీ%–%టీమ్స్ పోక్సో కేసు నమోదు చేయించాయి. ఇదిలా ఉంటే.. బహిరంగ ప్రదేశాల్లో యువతులు, మహిళలను టార్చర్ చేస్తున్న 49 మంది పోకిరీలను షీ%–%టీమ్స్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి.

**తియ్యటి మాటలు నమ్మొద్దు..**
ఈ సందర్భంగా ప్రజలు, మహిళలకు పోలీసులు కీలక సూచనలు చేశారు. 'సోషల్ మీడియా పరిచయాలతో అప్రమత్తంగా ఉండండి. అపరిచితుల తియ్యటి మాటల్ని నమ్మకండి. మంచిగా మాట్లాడుతున్నారు కదా అని వ్యక్తిగత వివరాలు, ఫోటోలు షేర్ చేసుకోకండి. ఎవరైనా సోషల్‌మీడియాలో వేధింపులకు గురిచేస్తే తక్షణమే పోలీసులను ఆశ్రయించండి. మీ గోప్యతకు భంగం వాటిల్లకుండా పరిష్కారం లభిస్తుంది' అని పోస్ట్ పెట్టారు.




# సరస్వతి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

**కరీంనగర్, మే 8 వెలుతురు**
తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే "అంతర్వాహిని" సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు.అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ స్నానానికి లక్షల మంది భక్తులు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారని తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పటి నుంచి 12 రోజుల పాటు ఆచరిస్తారని, తెలంగాణ ఏర్పడిన వచ్చిన తొలి పుష్కరాలని అన్నారు. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతాయని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని చెప్పారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. సరస్వతి పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రారంభించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. 'సరస్వతీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టినట్టు ఇరువురు మంత్రులు తెలిపారు. కొన్ని చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని... అవి కూడా పుష్కరాలు ప్రారంభమయ్యేలోపు అయిపోతాయని అధికారులకు మంత్రులు నివేదించారు.ఈ పుష్కరాలు విజయవంతం నిర్వహించేందుకు తమ ప్రభుత్వం చాలా క్రియాశీలకంగా పని చేస్తుందన్నారు మంత్రి. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కల్యాణం, భద్రాచలం కల్యాణం మాదిరి ఈ పుష్కరాలు కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తాము సంకల్పిస్తున్నట్టు చెప్పారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. చలువ పందిళ్లు, టెంట్‌లు, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. కాళేశ్వరానికి సంబంధించిన వివరాలన్నీ ఆయా వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను అవసరానికి అనుగుణంగా నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు మంత్రులు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయ శాఖకు లాభం చేకూరినట్టు మంత్రి కొండా తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నట్టు మంత్రి కొండా సురేఖ చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. 'ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి కొండా తెలిపారు. పవిత్ర సరస్వతీ పుష్కర స్నానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వాసిస్తారని ఆమె తెలిపారు.సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలు ప్రారంభిస్తారన్నారు.



# గ్రామాల్లో ఎన్నికల హడావిడి

**హైదరాబాద్, మే 8, ( వెలుతురు)**
తెలంగాణలో ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న గ్రామ పంచాయితీలు, మండల పరిషత్‌లకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయా? అంటే అవుననే సమాధానమే ప్రభుత్వ వర్గాల నుండి వినిపిస్తోంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు ఆలస్యం కావడంతో త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తిచేసి గ్రామాల్లో పాలకవర్గాలను ఏర్పాటుచేయాలని సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేక గ్రామాల్లో అభివృద్ధి కుంటుబడుతోంది. ఏడాదికాలంగా గ్రామ పంచాయితీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది... అధికారంలోకి వచ్చింది మొదలు రేపు మాపు అంటూనే ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తోంది కాంగ్రెస్ సర్కార్. అయితే మరో రెండునెలల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయితీలు, మండల పరిషత్ లకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సిద్దమైందంటూ ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే తెలంగాణలో కులగణన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ డేటా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ ఈ రిజర్వేషన్ల అంశం పెండింగ్ లో ఉండటంవల్లే ఎన్నికలు ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రాగానే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. జూలైలో పంచాయితీ ఎన్నికలు నిర్వహించేందుకు దిశగా ప్రభుత్వం పావులు కదుపుతున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం.ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయితీ ఎన్నికలకు సిద్దమయ్యింది. బ్యాలెట్ బాక్సులను సమకూర్చుకుంది. ప్రభుత్వం నుండి ఆదేశాలు వెలువడగానే షెడ్యూల్ విడుదలచేసి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. జూన్ చివర్లో లేదంటే జూలై ఆరంభంలో పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు కొద్దిరోజుల వ్యవధిలోనే నిర్వహించాలని రేవంత్ సర్కార్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పంచాయితీ ఎన్నికలను ఒకే విడతలో నిర్వహించి కేవలం 15-20 రోజుల్లో ఈ ప్రాసెస్ ను పూర్తిచేయాలని... మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను కూడా ఇలాగే తక్కువ సమయంలో పూర్తిచేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఇలా ఒకే విడతలో ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను ఈసి పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అంతా ఓకే అయితే జూలైలో గ్రామాల్లో ఎన్నికల హడావిడి మొదలుకానుంది.




**స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు..**
ఇక తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు ఆమోదం పొందితే.. తెలంగాణలో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరుతాయి ఇది సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితిని దాటుతుంది. అయితే ఈ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది, తద్వారా న్యాయ సమీక్ష నుండి రక్షణ పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ బిల్లు ప్రస్తుతం గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే, తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం పెరుగుతుంది.తెలంగాణ రాష్ట్రంలోని 540 మండలాల పరిధిలో ఉన్న 12,966 గ్రామాలకు సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే, 1,14,620 వార్డులకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన జాబితాను పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. గత ఎన్నికల్లో 535 మండలాల్లోని 12,732 గ్రామాల్లో 1,13,152 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈసారి అదనంగా 5 మండలాలు, 234 గ్రామాలు, 1,468 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

# సౌదీ విదేశాంగ మంత్రి భారత్ రాక

- విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ



**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):**
భారత్–పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ.. సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీలో దిగారు. దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్‌జుబైర్ నేడు దిల్లీకి వచ్చీ రావడంతోనే మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలను చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు–తెలుస్తోంది. దీనిపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఎక్స్‌వేదికగా పోస్టు చేశారు. సౌదీ అరేబియా మంత్రి అదెన్ అల్ జుబైర్‌తో సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని ఆయనకు వివరించానని జైశంకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్–పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా సౌదీ మంత్రితో భేటీ జరిగింది. ఆ తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్ఛితో మన విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇప్పటికే భారత్–పాక్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. సోదరుల్లాంటి పొరుగుదేశాలే మాకు అత్యున్నత ప్రాధాన్యం అని పేర్కొన్నారు. అంతేకాదు.. భారత్, పాక్‌లోని తమ దౌత్యకార్యాలయాల సహకారంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గిస్తామని పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను కూడా అరాగ్ఛి ఎటు–వంటి ముందస్తు సమాచారం లేకుండానే సందర్శించారు. అక్కడి నాయకులతో చర్చించి.. తిరిగి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తర్వాత న్యూదిల్లీకి వచ్చారు.

# వెనక్కి వచ్చిన గగన్‌యాన్ వ్యోగమగామి అజిత్ కృష్ణన్



**న్యూఢిల్లీ,మే8( వెలుతురు):**
పాక్‌తో నెలకొన్న ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గగన్‌యాన్ వ్యోమగామి అజిత్ కృష్ణన్ ను వాయుసేన వెనక్కి పిలిపించింది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం వాయుసేన నుంచి ఎంపికైన వారిలో అజిత్ కూడా ఒకరు. తాజాగా దిల్లీలో నిర్వహించిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ఎ÷–లోరేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన.. ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 'ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఐఏఎఫ్ నుంచి నాకు పిలుపొచ్చింది' అని తెలిపారు. వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా.. గగన్‌యాన్ యాత్రకు ఎంపికయ్యారు. భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందం వీరే. 2027లో ఈ యాత్ర జరగనుంది. దీనికోసం అజిత్, అంగద్ ప్రస్తుతం భారత్‌లో శిక్షణ పొందుతుండగా.. శుభాంశు శుక్లా, నాయర్ అమెరికాలో శిక్షణ తీసుకుంటున్నారు. అజిత్.. 2003లో ఐఏఎఫ్‌లో చేరారు. వాయుసేనలో ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్నారు. 2900 గంటలకు పైగా పలురకాల యద్ధ విమానాల్ని నడిపిన అనుభవం ఆయన సొంతం. ఇదిలాఉంటే.. మరో వ్యోమగామి మే 29న శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనం కానున్నారు.

# తెరపైకి మంత్రివర్గ విస్తరణ

**హైదరాబాద్, మే 8, ( వెలుతురు)**
తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బుధవారం ఢిల్లీకి రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు అందినట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి పర్యటనతో మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వస్తుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.కాంగ్రెస్ అధిష్టానం పిలుపుతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లతో కలిసి ఢిల్లీకి వెళ్లనున్నారు.కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు కావడంతో.. తెలంగాణలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం తీసుకునే అవకాశముందని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లు రాష్ట్ర నేతలతో గతంలో పలు దఫాలుగా చర్చించారు.రెండు నెలల క్రితమే మంత్రి వర్గ విస్తరణ అంటూ హడావుడి జరిగినా ఎటూ తేల్చలేదు. చివరిసారిగా అందరి అభిప్రాయాలు తీసుకొని, మంత్రి వర్గ విస్తరణపై నిర్ణయాన్ని తెలియ చేస్తామని చెప్పారు.ఆ తర్వాత ఎలాంటి కదలిక లేకుండా ఉండిపోయింది.తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలు ఢిల్లీకి రావాలని మంగళ వారం రాత్రి పిలుపు రావడంతో మంత్రివర్గ విస్తరణపైనే భేటీ ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. బుధవారం సాయంత్రం నీటిపారుదల శాఖకు చెందిన వివిధ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి పాల్గొనాల్సి ఉండగా ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో వాటిని రద్దు చేశారు.తెలంగాణ మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉండగా వాటిని ఆశిస్తున్న వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. తాజా విస్తరణలో నలుగురికి అవకాశం దక్కొచ్చని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. వీరిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శ్రీహరి ముదిరాజ్, జి. వివేక్, పి.సుదర్శన్ రెడ్డి వంటి వారికి మంత్రి వర్గంలో చోటు దక్కుతుందని ప్రచారం జరుగుతోంది.

# పూర్తిస్థాయి యుద్ధం వస్తే భారత్‌దే విజయం


## అమెరికన్ మాజీ పైలట్ డేల్ స్కార్ట్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మే 8( వెలుతురు):**



పాక్‌తో యుద్ధంలో భారత్‌దే విజయం అంటూ అమెరికా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఓ మాజీ పైలట్ నెట్టింట పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది. డేల్ స్టార్క్ అనే మాజీ పైలట్ గురువారం ఈ పోస్టు నెట్టింట పంచుకున్నారు. భారత్ గెలుపుపై తన మొత్తం డబ్బును పందెం కాసేందుకు సిద్ధమేనని అన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలను కచ్చితమైన మిసైల్ దాడులతో ధ్వంసం చేసింది. అయినా బుద్ధి తెచ్చుకోని పాక్ ప్రస్తుతం సరిహద్దు వెంబడి కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో పరిస్థితులు ముదిరితే ఎలా అన్న చర్చ మొదలైంది. ఈ విషయంపై డేల్ స్టార్క్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్, పాక్ పైలట్లు–ఇద్దరితోనూ నేను గతంలో కలిసి పనిచేశా. ఈ పరిస్థితి ముదిరితే మాత్రం భారత్‌కే విజయం దక్కుతుందని నా అభిప్రాయం అని పేర్కొన్నారు. డేల్ కామెంట్స్‌కు పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పాక్ వద్ద అమెరికాకు చెందిన ఎఫ్–16, చైనాకు చెందిన జేఎఫ్–17 విమానాలు ఉంటే భారత్ వద్ద ఫ్రాన్స్‌కు చెందిన అత్యాధునిక రఫేల్ విమానాలు ఉన్నాయి. 4.5 తరం యుద్ధ విమానమైన రఫేల్.. భారత యుద్ధ విమానాల్లో అత్యాధునికమైనది. భారత ఉపఖండ పరిస్థితుల కోసం 13 ప్రత్యేక ఫీచర్లను కూడా రఫేల్‌కు జోడించారు. బియాండ్ విజువల్ రేంజ్ లక్ష్యాలను ధ్వంసం చేసే మెటియార్ మిసైల్స్, ఎల్రాక్ట్రిక్ యుద్ధరీతులకు ఉద్దేశించిన సాధనాలు, గొప్ప సామర్థం కలిగిన రాడార్, కమ్యూనికేషన్ వ్యవస్థలు ఈ విమానంలో ఉన్నాయి. ఫలితంగా యుద్ధ సమయాల్లో అత్యంత సమర్థవంతంగా ఈ విమానాలు తమ లక్ష్యాలను ధ్వంసం చేయగలవు. ఇక హామర్ బాంబ్స్, స్కాల్ప్ మిసైల్స్‌తో రఫేల్ యుద్ధ విమానాలు శత్రుదేశ మూలమూలాల ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేయగలవు. ఇక పాక్‌కు ఎఫ్–16లు విక్రయించేటప్పుడే అమెరికా ఎన్నో ఆంక్షలు విధించింది. భారత్‌పై ఈ విమానాలను వాడొద్దని స్పష్టం చేసింది. ఎఫ్–16ల వినియోగంపై వేయి కళ్లతో నిఘా పెట్టింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న పాక్‌కు ఎఫ్–16ల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో, ఎఫ్–16 అన్ని అవసరాలకు వినియోగించుకోలేని పరిస్థితుల్లో పాక్ ఇరుక్కుపోయింది. జేఎఫ్ –17 యుద్ధ విమానాలు ఉన్నప్పటికీ వీటి సామర్థం రఫేల్‌తో పోలిస్తే పరిమితమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఆయుధాలు మోసుకెళ్లే సామర్థం, యుద్ధసమయాల్లో శత్రువుల దాడుల నుంచి తప్పించుకోవడం, సుదూరాన లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థంలో జేఎఫ్–17 రఫేల్‌తో పోలిస్తే వెనకబడే ఉంటోంది.

# ఆర్‌ఆర్‌ఆర్' సౌత్ అలైన్‌మెంట్ లో మార్పులు



**హైదరాబాద్, మే 8, ( వెలుతురు)**
రీజినల్ రింగ్ రోడ్డు (దక్షిణ భాగం) నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. అలైన్‌మెంట్‌ను పరిశీలించిన అనంతరం.. పలు మార్పులు సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని అధికారులకు స్పష్టం చేశారు.రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకునే పనిలో ఉంది. తాజాగా ముఖ్యమంత్రి రెడ్డి.. అర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం నిర్మాణ పనులపై సమీక్షించారు. అధికారులకు కీలక సూచనలు చేశారు.తెలంగాణలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతర రహదారుల నిర్మాణం, జంక్షన్లు, వాటి మధ్య అనుసంధానత ఉండాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ (దక్షిణ భాగం) కు సంబంధించిన అలైన్‌మెంట్‌ను పరిశీలించిన అనంతరం .. పలు మార్పులు సూచించారు.

ఆర్‌ఆర్‌ఆర్(సౌత్) పనులు – సీఎం కీలక సూచనలు:
ఆర్‌ఆర్‌ఆర్ (దక్షిణ భాగం)కు సంబంధించిన అలైన్‌మెంట్‌కు సంబంధించి అటవీ ప్రాంతం, జల వనరులు, మండల కేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు.అలైన్‌మెంట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని స్పష్టం చేశారు.శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు అనుసంధానం చేసే రేడియల్ రోడ్ల నిర్మాణం ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.హైదరాబాద్ నుంచి వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్‌ఆర్‌ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో తగు రీతిలో ట్రంపెట్స్ నిర్మించాలి. ఎటువంటి గందరగోళానికి తావులేకుండా, ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా దాటేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్, నూతన అలైన్‌మెంట్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్‌ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించాలన్నారు. ఈ నూతన రహదారులకు సంబంధించి జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.తెలంగాణకు మరో మణిహారంగా రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టు నిలవనుంది. ఆర్‌ఆర్‌ఆర్‌ను 348 కిలోమీటర్ల పొడవున రెండు భాగాలుగా (ఉత్తర, దక్షిణ) నిర్మించనున్నారు. దీనికి పది వేల ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ కూడా షురూ అయింది.రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగంలో భూసేకరణతో పాటు ఇతర ప్రాథమిక ప్రక్రియలు మొదలయ్యాయి. మొత్తం ఐదు ప్యాకేజీల్లో చేపడుతున్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా దీన్ని నిర్మించనున్నారు. ప్రధానంగా ఔటర్ రింగ్ రోడ్డు తోపాటు.. జాతీయ రహదారులు, ఇతర జిల్లా కేంద్రాలకు వెళ్లే మార్గాలను దృష్టిలో పెట్టుకుని ఇంటర్‌ఛేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 11 ఇంటర్‌ఛేంజ్‌లతో పాటు టోల్‌ప్లాజాలు, రెస్టారూంలు, సర్వీసు రోడ్లు, బస్‌బేలు, ట్రక్ బేలు నిర్మించనున్నారు ఇప్పటికే పలువురు రైతులు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. కొందరు బాధితులు ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వీరితో అధికారులు చర్చలు జరుపుతోంది. నష్ట పరిహారం విషయంలో చర్చలు కొలిక్కి వస్తే%ొ% ఉత్తర భాగం పనులు పూర్తిస్థాయిలో సుగమం అవుతుందని స్పష్టం చేస్తున్నారు.హైదరాబాద్‌కు చుట్టూ 60 – 70 కిలోమీటర్ల అవతల తెలంగాణలోని పలు ప్రధాన జిల్లాల మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఇక దక్షిణ భాగం 182 కిలోమీటర్ల మేర ఉంటుందనేది ప్రాథమిక అంచనా. ఇది సంగారెడ్డి నుంచి కంది,నవాబ్‌పేట, చేవెళ్ల, షాబాద్, షాద్‌నగర్, ఆమన్‌గల్, మర్రిగూడ, సంస్థాన్ నారాయణపూర్ మీదుగా చౌటుప్పల్ వరకు పొడవు విస్తరించి ఉండనుంది. ఇక్కడ కూడా భూసేకరణ విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# నిస్సహాయితా... నిజాయితా...






**హైదరాబాద్, మే 8, ( వెలుతురు)**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, అప్పుల భారం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన చేసిన ప్రకటనలు నిజాయతీగా చెప్పే ప్రయత్నమా లేక నిస్సహాయతను బహిర్గతం చేసే చర్యనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాయకుడు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపాలని భావించే సమాజంలో, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర ఇమేజ్‌ను, కాంగ్రెస్ పార్టీ అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తాయన్నది కీలక చర్చ.రేవంత్ రెడ్డి పదే పదే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలిన అప్పుల భారంతో సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలను కొందరు నిజాయతీగా, బహిరంగంగా సత్యాన్ని చెప్పే ప్రయత్నంగా చూస్తుండగా, మరికొందరు ఇది రాజకీయంగా తప్పుడు సంకేతాలను పంపుతుందని విమర్శిస్తున్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్థిక సంక్షోభాన్ని బహిరంగంగా ప్రకటించడం వల్ల ప్రజల్లో ఆందోళన పెరుగుతుందని, పెట్టుబడిదారులు రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయితే, రేవంత్ రెడ్డి ఈ ప్రకటనల ద్వారా గత ప్రభుత్వ వైఫల్యాలను హైలైట్ చేసి, ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాలని భావిస్తున్నట్లు కూడా కనిపిస్తోంది.పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో సహా అనేక హామీలు ప్రజల్లో భారీ ఆశలను రేకెత్తించాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత, ఉచిత బస్సు పథకం, రైతు రుణమాఫీ వంటి కొన్ని హామీలను అమలు చేసినప్పటికీ, ఇతర హామీల అమలు విషయంలో ఆలస్యం జరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దీనికి కారణమని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. కానీ, సామాన్య ప్రజలకు ఖజానా స్థితితో సంబంధం లేకుండా, హామీలు అమలు కావాలనే ఆశ ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఆర్థిక సంక్షోభం గురించి మాట్లాడటం వల్ల ప్రజల్లో నిరాశ పెరిగే అవకాశం ఉందని విమర్శకులు అంటున్నారు.రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల గురించి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర సర్కారీ ఉద్యోగుల ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. వేతనాలు, బకాయిల చెల్లింపు విషయంలో ఆలస్యం కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె బాట పట్టే ఆలోచనలో ఉన్నారు. ఖజానాలో డబ్బులు లేవని ముఖ్యమంత్రి చెప్పడం వల్ల ఈ ఆందోళనలు తగ్గుతాయా లేక మరింత ఉధృతమవుతాయా అన్నది ప్రశ్న. ఉద్యోగుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సందర్భంలో, రేవంత్ రెడ్డి నాయకత్వ శైలి, సమస్యలను ఎదుర్కొనే విధానం తీవ్ర పరీక్షకు గురవుతోంది.కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత వివాదాస్పదమయ్యాయి. ఈ ప్రకటనలు ఒకవైపు కేంద్రంతో సంబంధాల్లో ఒడిదొడుకులను సూచిస్తుండగా, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం బలహీనంగా కనిపించేలా చేస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టుల అనుమతులు సాధించడంలో రేవంత్ రెడ్డి ఎదుర్కొంటున్న సవాళ్లు నిజమైనవే అయినప్పటికీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెప్పడం వల్ల ఆయన ఇమేజ్‌పై ప్రభావం పడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోనూ చర్చకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఆయన నిజాయతీగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు వంటి నాయకులు సమర్థిస్తున్నప్పటికీ, పార్టీలోని అందరూ ఈ విధానాన్ని సమర్థించే అవకాశం తక్కువ. రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని బహిరంగంగా చర్చించడం వల్ల ప్రతిపక్షాలకు రాజకీయ ఆయుధం దొరికినట్లయిందని, ఇది కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపవచ్చని అంటున్నారు. ఈ పరిస్థితిలో, రేవంత్ రెడ్డి తన నాయకత్వ శైలిని సమతుల్యం చేసుకోవడం, సమస్యలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనే విధంగా వ్యవహరించడం కీలకం.

## ఏసీబీ అధికారిగా బెదిరింపులు

● కూపీ లాగితే లేడీ పోలీస్ పాత్ర ఉన్నట్లు గుర్తింపు



**విశాఖపట్నం,మే8( వెలుతురు):**
విశాఖపట్నంలో నకిలీ ఏసీబీ అధికారి కలకలం సృష్టించాడు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బలగా సుధాకర్ చాలాకాలం కిందట విశాఖలోని ఆదర్శనగర్ పాత డెయిరీఫారం వద్ద నివాసం ఉంటూ..రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ చక్రపాణిని కలిసి.. తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌నని పరిచయం చేసుకుని.. మీ ఆఫీస్‌లో అవినీతిపై తమకు చాలా ఫిర్యాదులు అందాయని, వాటిపై కేసు నమోదుచేయాల్సి ఉందంటూ బెదరించాడు.. అయితే, ఏసీబీ అధికారినంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేసిన అతడిని విశాఖ పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేశారు.. అయితే, నకిలీ ఏసీబీ అధికారి కేసులో సంచలన అంశాలు వెలుగు చూస్తున్నాయి.. నకిలీ ఏసీబీ అధికారి కేసులో ఊహించని ట్విస్ట్ వచ్చింది. నకిలీ ఏసీబీ వెనుక కిలాడీ లేడీ ఖాకీ ఉన్నట్టుగా అధికారులు చెబుతన్నారు.. ఆ కిలాడీ లేడీ ఖాకీ ఎవరో కాదు.. గతంలో నోట్ల మార్పిడి కేసులో సంచలనంగా మారిన రిజర్వుడు ఇన్స్పెక్టర్ స్వర్ణలత.. ఈ ఘటనతో లేడీ పోలీస్ స్వర్ణలత తన తీరు మార్చుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.. సస్పెండ్ అయ్యి జైలుకి వెళ్లొచ్చినా ఆమె వ్యవహార శైలిలో మార్పురాలేదు. మధురవాడ సబ్ రిజిస్టర్‌ను బెదిరించిన కేసులో ఈమె పాత్ర ఉందని తేల్చారు పోలీసులు... నకిలీ ఏసీబీ సుధాకర్ ను అడ్డుపెట్టుకొని డబ్బుల కోసం ఈ ఆగడాలకు దిగారట.. సుధాకార్ కాల్ లిస్ట్ ఆధారంగా స్వర్ణలత బండారం బట్ట బయలు అయినట్టు– అయ్యింది.. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఏఆర్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు స్వర్ణలత.. ఈ వ్యవహారంలో వెలుగు చూడడంతో కిలేడీ లేడీ పోలీస్ పరారీలో ఉన్నారు. దీంతో, స్వర్ణలత కోసం పోలీసుల ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు..

## గుజరాత్ ఖావ్డా వద్ద డ్రోన్ పేలుడు


● అప్రమత్తం అయిన భద్రతా బలగాలు



**అహ్మదాబాద్,మే8( వెలుతురు):**
ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ విరుకుచుపడింది. ఈ దాడులతో ప్రస్తుతం భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో గుజరాత్‌లోని కచ్ జిల్లాలోని ఇండియా–పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో అనుమానాస్పద పేలుడు సంభవించింది. దీంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఖావ్డా ఇండియా బ్రిడ్జి సరిహద్దు ప్రాంతంలో గురువారం ఉదయం డ్రోన్ పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు, వైమానిక దళ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే డ్రోన్ సరిహద్దు అవతల నుంచి వచ్చిందా లేదా అనేది ఇంకా నిర్ధారించలేదు. అయితే అనుమానాస్పద డ్రోన్ హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఢీకొట్టడంతో పేలుడు సంభవించినట్లు– తెలుస్తోంది. డ్రోన్ పేలుడుకు, పాకిస్తాన్‌కు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. భారత్ దాడులను జీర్ణించుకోలేని పాకిస్తాన్.. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరుపుతోంది. గురువారం కూడా కాల్పులను కొనసాగిం చింది. అయితే భారత ఆర్మీకి వారికి దీటుగా సమాధానం ఇస్తోంది. పాకిస్తాన్ తిరిగి దాడులు చేయనుందనే సమాచరంతో భారత్ అప్రమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో ఇప్పటికే హై అలర్ట్ ప్రకటించింది. పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేయడంతో పాటూ సెలవులో ఉన్న అధికారులను వెంటనే విధుల్లో హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు– చేస్తున్నారు.

## ప్రధాని మోడీ ..ఓ అనికేత్: పవన్ ట్వీట్

**అమరావతి,మే8( వెలుతురు):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ సంచలన ట్వీట్ చేశారు. ప్రధాని మోదీని అనికేత్ అని అభివర్ణించారు. అనికేత్ ఒక పేరు, ఒక సంకల్పమని తెలిపారు. తన సన్యాసి జీవితంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అనికేత్ అని పిలిచేవారని పవన్ అన్నారు. అనికేత్ అంటే ఇళ్లు లేకుండా అని అర్థం అని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ప్రధాని గురించి పవన్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'అనికేత్' – ఒక పేరు, ఒక సంకల్పం. తన సన్యాసి జీవితంలో, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీనియస్ అని సంబోధించారు.




# పాక్,భారత్ మధ్య ఉద్రిక్తతలు

### నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబయి,మే8( వెలుతురు):**
భారత్– పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. . భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు పాక్ యత్నించింది. దీంతో ఆ దేశంలో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ వార్తల నేపథ్యంలో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఉద్రిక్తతల నేపథ్యంలో చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,300 దిగువకు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఉదయం 80,912.34 పాయింట్ల (క్రితం ముగింపు 80,746.78) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య చలించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.72గా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం పతనం అవ్వగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ




సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హెచ్‌సీఎల్ –టె–క్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, –టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 61.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలవుతోంది. 'ఆపరేషన్ సిందూర్'తో నిన్న భారీగా పతనమైన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. నేడు అరగంట పాటు– నిలిచిపోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగాలు విరుచుకుపడ్డాయన్న సమాచారంతో వ్యాపించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్‌ఈ 100 సూచీ దాదాపు 6,948 పాయింట్ల (6.32 శాతం) నష్టంతో 103,060 వద్ద నిలిచింది. కాసేపటికే ట్రేడింగ్ ప్రారంభమైనప్పటికీ నష్టాలు కొనసాగాయి.

## చంద్రబాబు సెక్యూరిటీపై రాజీపడొద్దు

● పూర్తి స్థాయిలో సెక్యూరిటీ ప్రొటోకాల్స్ అమలు

● సెక్యూరిటీ వింగ్‌తో పాటు.. జిల్లా ఎస్పీలకు డిజిపి ఆదేశాలు

**అమరావతి,మే 8 ( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెక్యూరిటీ– విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇంటలిజెన్స్ అండ్ సెక్యూరిటీ– వింగ్ ఉన్నతాధికారులను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. సెక్యురిటీ ప్రొటోకాల్స్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని.. ఎక్కడా రాజీ పడ వద్దని ఉన్నతాధికారులకు ఆయన కీలక సూచన చేశారు. అలాగే జన సమూహంలోకి ముఖ్యమంత్రి వెళుతున్న సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని జిల్లాల ఎస్పీలను ఆయన ఆదేశించారు. ఆ తర్వాత ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి డీజీపీ హరీష్ కుమార్ తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తనదైన శైలిలో స్పందించారు. సామాన్య ప్రజలు, కార్యకర్తలకు ఎటు–వంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన మేర భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు సూచించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతీకార చర్యలకు భారత్ దిగిన సంగతి తెలిసిందే. అనంతరం వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా చర్యలు, ప్రజలు, సంస్థల రక్షణతోపాటు– వీఐపీల భద్రతపై గురువారం అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ప్రస్తుత పరిస్థితులతోపాటు– తదుపరి తీసుకోవాల్సిన భద్రత చర్యలపై డీజీపీ హరీష్ కుమార్



గుప్తా అధ్యక్షతన కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశానికి ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హాతోపాటు– పలువురు కీలక ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఆ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భద్రత విషయంపై కీలక సమీక్ష నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ క్రమంలో బుధవారం తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు– పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదు స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో 100 మంది వరకు మరణించినట్లు– కేంద్రం ప్రకటించింది. భారత్ తీసుకున్న ఈ చర్యలు అనంతరం కేంద్రం హోం మంత్రి అమిత్ షా.. అన్ని రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రాలకు కేంద్ర మంత్రి అమిత్ షా పలు కీలక సూచనలు చేసిన సంగతి తెలిసిందే.

## కడపలో మహానాడుకు చురుకుగా ఏర్పాట్లు

**పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి వెల్లడి**

**కడప,మే 8( వెలుతురు):**
తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు– నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని నభూతో నభవిష్యత్తు అనే విధంగా నిర్వహిస్తామని కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వచ్చే అతిథుల కోసం వసతి ఏర్పాట్లు– పూర్తి చేసినట్లు– ఆయన తెలిపారు. గురువారం కడపలో శ్రీనివాసులు రెడ్డి విలేకరలతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి తొలి రోజు 40 వేల మంది అతిథులు హాజరవుతు న్నారన్నారు. 12 జిల్లాల నుంచి వచ్చే వారి కోసం వసతి ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ జిల్లాలో తొలిసారి పసుపు పండుగ మహానాడు జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం కమిటీ–లు వేసి వాటి ద్వారా మహానాడును విజయవంతం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా ఏర్పాట్లు– చేశామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులను కలుపుకుని ఈ మహానాడును



విజయవంతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నుంచి పూర్తి స్థాయి పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని లాడ్జిలు, కళ్యాణ మండపాలుతోపాటు– స్కూళ్లు అన్నింటిలో వసతి ఏర్పాట్లు– చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 9063596644 ఏర్పాటు– చేసినట్లు– ఆయన వివరించారు. మహానాడు ముగింపు రోజు.. అంటే మూడవ రోజు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## బండి కార్యాలయానికి బెదరింపులు

● నాదర్‌గుల్ నుంచి కాల్ వచ్చినట్లు గుర్తింపు

● రంగంలోకి దిగి కెపి రావు అనే వ్యక్తి అరెస్ట్

**న్యూఢిల్లీ,మే 8( వెలుతురు):**
తాను చెప్పిన పని చేయాలని.. లేకుంటే మీ సంగతి చూస్తాంటూ ఓ అజా&ఝుత వ్యక్తి న్యూఢిల్లీ లోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి గురువారం ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వెంటనే స్పందించింది. ఈ బెదిరిం పులపై ఆయన కార్యాలయం.. హైదరాబాద్‌లోని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబుకు ఫోన్ చేసి వివరించింది. దాంతో సీపీ సుధీర్ బాబు ఆదేశాల మేరకు.. పోలీసులు రంగంలోకి దిగారు. ఆ క్రమంలో ఈ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి



ఎక్కడి నుంచి ఫోన్ చేశాడంటూ.. సెల్ టవర్ల ఆధారంగా విచారణ చేపట్టారు. దీంతో ఆదిభట్ల పరిధిలోని నాదర్ గుల్ సమీపంలో జయసూర్య నగర్‌కు చెందిన కేపీ రావు.. ఈ ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తిం చారు. దీంతో కేపీరావును పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. అనంతరం అతడిని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. ఆ తర్వాత అతడిని పోలీసులు విచారిస్తున్నారు. అయితే గతంలో సైతం కేపీ రావు.. లంచాల కోసం పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు– పలువురు రాజకీయ నాయకులకు ఈ తరహా ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడే వారని పోలీసుల విచారణలో గుర్తించారు.

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఏర్పాటు

● ఆహ్వానం పలుకుతూ చంద్రబాబు ట్వీట్



**అమరావతి,మే8( వెలుతురు):**
ఏపీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు హర్షం ప్రకటించారు. ఎల్‌జీకి ఆంధ్రప్రదేశ్ ఆహ్వానం పలుకుతోందంటూ ట్వీట్ చేశారు. శ్రీసిటీలో రూ.5,800కోట్లకు పైగా పెట్టుబడులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,500పైగా ఉద్యోగాలతో ఈ సంస్థ ఏపీని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పెట్టు–బడి ప్రోత్సాహక కమిటీ–(÷ూఒఈ) కింద ఈ సంస్థ 100శాతం ప్రోత్సాహకాలు పొందిందని సీఎం తెలిపారు. ఇది మన రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధికి ఒక ఉత్తేజకరమైన కొత్త అధ్యాయానికి నాంది పలికిందని పేర్కొంటూ శ్రీసిటీ–లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు మంత్రి నారా లోకేశ్ నేడు శంకుస్థాపన చేసిన అనంతరం దిగిన ఫొటోను సీఎం షేర్ చేశారు.

## అందాల పోటీలకు హైదరాబాద్ వేదిక

● 109 దేశాల నుంచి కంటెస్టెన్‌ల రాక



**హైదరాబాద్,మే8( వెలుతురు):**
ప్రపంచ అందాల పోటీలకు హైదరాబాద్ వేదికగా మారింది. 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ ఈనెల 10 నుండి 31 వరకు జరగనుంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు 109 దేశాల నుండి కంటెస్టెంట్స్ నగరానికి చేరుకున్నారు. అయితే, ఇతర దేశాల నుండి మరికొంతమంది పోటీదారులు ఇంకా వచ్చే అవకాశముంది. శుక్రవారం లోగా మొత్తం అభ్యర్థులు నగరానికి చేరుకోనున్నారు. ఇక భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నందిని గుప్తాతో పాటు–, అథెన్నా క్రాస్బీ (అమెరికా), ఎమ్మా మోరిసన్ (కెనడా), వాలేరియా కాన్యావో (వెనిజులా) వంటి ప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. అమెరికా, దక్షిణాఫ్రికా, వెనిజులా వంటి ప్రముఖ దేశాలతో పాటు– గ్వాడలూప్, గిబ్రాల్టర్, మార్టినిక్, క్యురాకావ్ వంటి చిన్న దేశాల నుంచి కూడా ప్రతినిధులు పాల్గొనడం విశేషం. విద్యార్థులు, డాక్టర్లు, న్యాయవాదులు, సామాజిక వేత్తలు, కళాకారులు, ఉద్యమకారులుగా ఉన్న పోటీ–దారులు తమ దేశాల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక పోటీ–ల్లో పాల్గొనే పోటీ–దారులు దాదాపు నెల రోజులపాటు– తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక, సాంస్కృతిక, వైద్య, చేనేత, ఆవిష్కరణ కేంద్రాలను సందర్శించనున్నారు. గత ఏడాది ముంబయిలో మిస్ వరల్డ్ ఈవెంట్ జరగగా.. ఈ ఏడాది మే 31న హైదరాబాద్ లోని హై–టె–క్స్ వేదికగా గ్రాండ్ ఫినాలే జరగనుంది. మిస్ వరల్డ్ పోటీ–లను వరుసగా రెండేళ్ల పాటు– భారత్ లో నిర్వహించడం తొలిసారి. ఈ అరుదైన గౌరవం దేశానికి మాత్రమే కాదు.. ముఖ్యంగా తెలంగాణకు కూడా విశ్వవేదికపై విశిష్ట గుర్తింపునిస్తుంది.

# హరిహరవీరమల్లు షూటింగ్ పూర్తి

## జూన్ 12న విడుదలకు డేట్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌కి బిగ్ అప్‌డేట్ వచ్చింది. హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ ఫైనల్‌గా కంప్లీట్ అయిపోయింది. ఎన్నో అవాంతరాల తర్వాత ఈ మూవీ రిలీజ్ డేట్ గురించి క్లారిటీ- వచ్చేసింది. మొదట మే 9 అని అధికారికంగా అనౌన్స్ చేసినా, షూటింగ్ జస్ట్ రెండు మూడు రోజుల క్రితమే ముగిసింది కాబట్టి, అంత తొందరగా రిలీజ్ చేయడం కాస్త కష్టమే. ఇప్పుడు తాజా బజ్ ఏంటంటే, ఈ సినిమా జూన్ 12న థియేటర్స్‌లో సందడి చేయబోతోంది! ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేస్తూ లీడింగ్ టికెట్ సెల్లింగ్ ఎ÷-లాట్‌ఫాం బుక్ మై షో జూన్ 12 డేట్‌తో 'కమింగ్ సూన్' అంటూ ఫైర్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేసింది. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఇప్పటికే హైప్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యి దాదాపు నాలుగేళ్లు అవుతోంది. 2020లో అనౌన్స్ అయిన హరిహర వీరమల్లు షూటింగ్‌లో కోవిడ్ పాండమిక్, పవన్ కళ్యాణ్ రాజకీయ కమిట్‌మెంట్స్ వల్ల బోలెడు డిలేస్ ఫేస్ చేసింది. ఆయన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ- సీఎంగా బిజీగా ఉండటంతో షూటింగ్ కాస్త స్లో అయింది. అయినా, 2024 సెప్టెంబర్‌లో విజయవాడలో సెట్‌లో షూటింగ్ రీస్టార్ట్ అయ్యి, మే 6, 2025 నాటికి ఫైనల్‌గా వ్రాప్ అయిపోయింది. ఇప్పుడు పోస్ట్-ప్రొడక్షన్, ÷ఎఎ÷ృ, డబ్బింగ్ వర్క్ ఫుల్ స్పీడ్‌లో జరుగుతోంది. పవన్ కళ్యాణ్ -టైటిల్ రోల్‌లో వీరమల్లుగా కనిపించబోతున్నాడు. బాబీ డియోల్ మొగల్ బాద్‌షా ఔరంగజేబ్‌గా విలన్ రోల్‌లో కనిపిస్తారు. నిధి అగర్వాల్ లీడ్ హీరోయిన్‌గా, అనుపమ్ ఖేర్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి లాంటి స్టార్ కాస్ట్ ఈ మూవీలో ఉన్నారు. డైరెక్షన్ క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ కాంబోలో జరిగింది. సినిమాకి ఆస్కార్ విన్నర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్ ఇచ్చారు, ఇప్పటికే 'మాట వినాలి', 'కొల్లగొట్టినాదిరో' సాంగ్స్ రిలీజ్ అయి ట్రెండ్ అయ్యాయి.




# పిల్లలను కనడం... ఓ పెద్ద టాస్క్: దీపిక



బాలీవుడ్‌లో తమదైన నటతో స్టార్స్‌గా ఎదిగారు దీపికా పదుకుణె-రణ్‌వీర్ సింగ్. సినిమా పరిశ్రమలో ఈ జంట తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటికీ బాలీవుడ్ లో భారీ రెమ్యూనరేషన్ తీసుకునే టాప్ స్టార్లలో వీరిద్దరూ ఉంటారు. ఇక మూడుముళ్ల బంధంతో ఒక్క-టైన ఈ జంట తమ ఆరేళ్ల వైవాహిక బంధానికి ప్రతీకగా, ఈ ఏడాది సెప్టెంబర్ లో పండంటి ఆడబిడ్డని తమ జీవితంలోకి ఆహ్వానించారు. దీంతో ఈ బాలీవుడ్ లవ్లీ కపుల్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మాతృత్వాన్ని ఆస్వాదిస్తున్నా అంటూనే దీపికా తిరిగి తన కెరీర్ ను మొదలు పెట్టింది. ఒప్పుకున్న సినిమాలు కంప్లీట్ చేసే పనిలో పడింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ దీపిక రణ్ వీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. దీపిక మాట్లాడుతూ.. 'పెళ్లయిన కొత్తలో ఓ సారి పిల్లలను కనడం గురించి రణ్‌వీర్ తో మాట్లాడుతూ.. ఎప్పుడు ప్లాన్ చేద్దాం అని అడిగాను. దానికి ఆయన సమాధానం ఇస్తూ.. పిల్లలను కనడం ఇద్దరి నిర్ణయం అయినప్పటికీ.. మోయాల్సింది నువ్వు మాత్రమే. బేబీ నీ శరీరంలోనే పెరుగుతుంది. కాబట్టి నువ్వే నిర్ణయం తీసుకోవాలి. పిల్లలను కనగలను అని నీకు ఎప్పుడు అనిపిస్తే అప్పుడు ప్లాన్ చేద్దాం అన్నారు. ఆయన మాటలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి' అని దీపికా చెప్పుకొచ్చింది.

# ఇట్స్ న్యూ బిగినింగ్.. సమంత ఆసక్తికర పోస్ట్



ఏమాయ చేసావేతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సమంత ఆ సినిమా సూపర్ హిట్ తో బ్యాక్ టు- బ్యాక్ సినిమాలతో స్టార్ హీరోయిన్ గా మారింది. ఆ దశలోనే అక్కినేని వారి వారసుడు నాగచైతన్య తో ప్రేమాయణం, పెళ్లి.. విడాకులు ఇలా అన్ని చకచకా జరిగిపోయాయి. చైతు నుండి విడాకులు తీసుకున్నాక టాలీవుడ్‌కు దూరంగా ఉంటూ వస్తోంది సమంత. అదే టైమ్ లో బాలీవుడ్ లో ఫ్యామిలీ మెన్ సిరీస్ తో సూపర్ హిట్ అందుకుంది. ఈ సిరిస్ తో ప్రశంసలతో పాటు- ఆ సిరిస్ దర్శకులలో ఒకరైన రాజ్ నిడమోరుతో ప్రేమలో పడిందనే ఆరోపణలు ఎదుర్కొంది సమంతా. రాజ్.. సమంతలు రిలేషన్ లో ఉన్నారనే టాక్ నడిచింది. ఓ వైపు సామ్ మొదటి భర్త నాగ చైతన్య మరో పెళ్లి చేసుకోవడంతో సమంత కూడా పెళ్లి పీటలు ఎక్కబోతుందని వార్తలు హల్ చల్ చేసాయి. కానీ అవన్నీ గాసిప్ లాగే మిగిలాయి. కానీ ఇప్పుడు లేటె-స్ట్ గా సమంత ' ఇది చాలా కష్టమైన ప్రయాణం. కానీ ఇక్కడి వరకూ చేరుకున్నాం. ఇట్స్ న్యూ బిగినింగ్ ' అని పోస్ట్ చేస్తూ దర్శకుడు రాజ్ నిడిమోరుతో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక సమంత నిర్మించిన శుభం మే 9న విడుదల కానుంది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించాడు. ఈయన డైరెక్ట్ చేసిన తొలిసినిమా 'సినిమా బండి' కి రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యహరించగా రెండవ సినిమాను సమంత నిర్మించడం కొసమెరుపు. ఇంతకీ సమంత చెప్పిన ఆ న్యూ బిగినింగ్ లోగుట్టు ఏమిటో వేచి చూడాల్సిందే.

# నా మహాభారతంలో నేనే కృష్ణుడిని

### మనసులో మాట వెల్లడించిన అమీర్ ఖాన్

మహాభారంతం కల నెరవేర్చే క్రమంలో బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ఒక్కో విషయం వెల్లడిస్తున్నాడు. అతిపెద్ద పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయిన మహాభారతంపై ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్ తన డ్రీమ్ అని అమీర్ ఖాన్ ఇప్పటికే చాలా సార్లు ప్రకటించారు. ఇక తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి మరోసారి స్పందించారు అమీర్ ఖాన్. 'ఈ సినిమాను ఈ ఏడాదిలోనే ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇందులో నాకు కృష్ణుడి పాత్ర చేయాలని ఉంది. ఆ పాత్ర నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఒక పాత్రలో ఇన్ని రకాల వేరియేషన్స్ ఉంటాయా అనిపించేలా ఉంటుంది కృష్ణుడి పాత్ర. ఆ పాత్రలో నటించడం చాలా కష్టం. అందులో ఉండే అన్ని షేడ్స్ విభిన్నంగా ఉంటాయి. అందుకే ఆ పాత్ర చేయాలని ఉందని తెలిపారు. ఈ మహాభారతంను ఒక మూవీలో చూపించలేం. దాన్ని కొన్ని భాగాలుగా చూపించొచ్చు. ఆ మూవీ స్క్రిప్ట్ కోసమే కొన్నేళ్ల టైమ్ పడుతుంది. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను. ప్రస్తుతం సినిమాల పరంగా కొంత స్పీడ్ తగ్గింది. కానీ నా సినిమాల కోసం ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్ని తీసుకుంటున్నాను. నా సినిమాల్లో నేను లాభాల్లో షేర్ తీసుకుంటాను. హిట్ అయితే మాత్రమే ఈ షేర్ తీసుకుంటా. ఒకవేళ ఫ్లాప్ అయితే ఒక్క రూపాయి కూడా తీసుకోను. ఎందుకంటే సినిమా నష్టాల్లో కూడా నేను బాధ్యత తీసుకోవాలి అనుకుంటాను' అంటూ చెప్పుకొచ్చాడు అమీర్ ఖాన్. మొత్తంగా మహాభారతం ఎలా తీస్తారన్న ఆసక్తి నెలకొంది.



# పాక్ నటుల వ్యాఖ్యలపై మండిపడ్డ సినీ వర్కర్స్


### వారికి భారత్‌లో చోటు ఇవ్వొద్దని నిర్ణయం

భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పాకిస్థానీ నటీనటులు ఫవాద్ ఖాన్, మహిరా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆల్ ఇండియా సినీ వర్కర్స్ అసోసియేషన్ ఖండించింది. వారిని తక్షణమే చిత్ర పరిశ్రమ నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చింది. కళల పేరుతో ఇలాంటివారికి గుడ్డిగా మద్దతు ఇవ్వొద్దని చిత్ర పరిశ్రమను అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. వారి కామెంట్స్ మన దేశాన్ని అగౌరవపరచేలా ఉండడం మాత్రమే కాదు.. ఉగ్రవాదం కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయకులను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులను కూడా అవమానించేలా ఉన్నాయి. మన చిత్ర పరిశ్రమలో వర్క్ చేసే పాకిస్థానీ కళాకారులు, చిత్రనిర్మాతలపై పూర్తిగా బ్యాన్ విధించాలి.

భారతీయులెవరూ వీరిని అభిమానించొద్దు. కళ పేరుతో ఇలాంటి కళాకారులకు గుడ్డిగా మద్దతు ఇవ్వడం జాతీయ గౌరవాన్ని అగౌరవ పరచడమేనని చిత్ర పరిశ్రమ అర్థం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశం కోసం ఐక్యంగా నిలబడదాం భారతీయ గాయనీగాయకులు పాక్ సింగర్స్‌తో వేదికలను పంచుకోవద్దని సూచించింది. జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరింది.

# యుద్ధం వద్దు : సినీ నటి సంజనా గల్రానీ

భారతదేశం, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ప్రస్తుత తరుణంలో, పలువురు ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో, తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి సంజన గల్రానీ సోషల్ మీడియా వేదికగా చేసిన కొన్ని వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ఆమె శాంతియుత పరిష్కారాన్ని ఆకాంక్షిస్తూ, యుద్ధం వల్ల కలిగే నష్టాలపై తన ఆందోళనను వ్యక్తం చేశారు. "నేను పూర్తి దేశభక్తురాలిని, కానీ అదే సమయంలో నేను సంపూర్ణ శాంతి ప్రేమికురాలిని. చిన్న లేదా పెద్ద యుద్ధం వచ్చే సూచనలు దేశ ప్రతిష్ఠకు మంచిది కాదు. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది, అంతర్జాతీయ పర్యాటకులపైనా ప్రభావం చూపవచ్చు. యుద్ధంలో పాల్గొన్న దేశానికి కలిగే నష్టం అపారమైనది. త్వరలోనే అంతా ప్రశాంతంగా ముగిసిపోతుందని నేను ఆశిస్తున్నాను. జై హింద్" అని పేర్కొన్నారు. సంజన చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాపించాయి. వీటిపై నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆమె అభిప్రాయాన్ని సమర్థిస్తుండగా, మరికొందరు తీవ్రంగా విమర్శిస్తూ కామెంట్లు పెడుతున్నారు. దేశభక్తిని చాటుతూనే శాంతిని కోరుకోవడం సమంజసమే అయినా, ప్రస్తుత సున్నితమైన పరిస్థితుల్లో ఇటువంటి వ్యాఖ్యలు చేయడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన సంజన, 2005లో తరుణ్ హీరోగా నటించిన 'సోగ్గాడు' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత ప్రభాస్ నటించిన 'బుజ్జిగాడు' చిత్రంలో సెకండ్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు పొందారు. రాజశేఖర్ 'సత్యమేవ జయతే', శ్రీకాంత్ 'దుశ్శాసన', 'సర్దార్ గబ్బర్ సింగ్' వంటి పలు తెలుగు చిత్రాల్లో ఆమె నటించారు. కాగా, గతంలో సంజన డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొని, కొంతకాలం జైలు జీవితం కూడా గడిపిన విషయం తెలిసిందే. వ్యక్తిగత జీవితంలో, సంజన 2020 లాక్‌డౌన్ సమయంలో బెంగళూరుకు చెందిన వైద్యుడు అజీజ్ పాషాను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు 2022లో ఒక కుమారుడు జన్మించగా, ప్రస్తుతం ఆమె మరోసారి గర్భవతిగా ఉన్నట్లు సమాచారం.



# తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట

- అందాల పోటీల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- ఆయా ప్రాంతాలను సందర్శించేలా కార్యక్రమాలు

**హైదరాబాద్,మే8( వెలుతురు):**

అంతర్జాతీయ అతివల అందాల పోటీలతో తెలంగాణ టూరిజానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడికి వచ్చే వారంతా తెలంగాణ లోని ప్రధాన పర్యాకట కేంద్రాలను సందర్శించనుండంతో వాటి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియనుంది. ముఖ్యంగా గ్రామీణ పర్యాటకం వెలుగులోకి రానుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇందుకు అనుగుణంగా భారగా ఏర్పాట్లు చేసింది. ఆహుతును పర్యాటక ప్రాంతాలకు తీసుకుని వెళ్లేలా ఏర్పట్లు చేసింది. తెలంగాణ పర్యాటకం అంటే రాజధాని హైదరాబాద్ మాత్రమే. మిస్ వరల్డ్ ఈవెంట్ ల నిర్వహణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పర్యాటకంను ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అందివచ్చిన అద్భుత అవకాశంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలుపడంతో పాటు- తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచ పటంలో ప్రముఖంగా నిలిపే అవకాశం లభిస్తుంది. నాగార్జునసాగర్ బుద్ధవనం , బౌద్ధ థీమ్ పార్క్, బౌద్ధ సంస్కృతి , ఆధ్యాత్మికతకు ప్రత్యేకించిన ఆకర్షణ. ఇది బుద్ధుని విగ్రహాలు, స్తూపాలు, ధ్యాన మండపాలతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇక్కడి థీమ్ పార్క్ బుద్ధుని జీవితం, బోధలు, బౌద్ధ కళ, సంస్కృతిని సజీవంగా ప్రదర్శిస్తుంది. ఈ ప్రాజెక్టు పర్యాటక రంగాన్ని బలపరుస్తూ, సాంస్కృతిక మార్పిడి, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోంది. ఆధ్యాత్మిక శాంతి, జ్ఞానోదయం కోసం ప్రయత్నిస్తున్నవారికి ఇది ఒక ఆదర్శ స్థలం. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న వేయి స్థంభాల గుడి, కాకతీయ రాజవంశం శిల్పకళా వైభవానికి నిదర్శనం. రుద్రదేవ మహారాజు 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ గుడి శివుడు, విష్ణువు సూర్యదేవుడికి అంకితమైంది. ప్రత్యేకమైన త్రికూటాకార నిర్మాణంతో, నక్షత్ర ఆకారపు వేదికపై నిలిచి ఉంది. గర్భగుడి చుట్టూ 1000కు పైగా సున్నితంగా చెక్కబడిన స్థంభాలు ఉన్నాయి. ప్రధాన ఆకర్షణ ఏకశిలా నంది విగ్రహం, ఇది శిల్పుల నైపుణ్యాన్ని చాటుతుంది. ఈ దేవాలయం తురుష్కుల దండయాత్రలో కొంత భాగం నాశనమై, 20వ శతాబ్దంలో పునరుద్ధరించబడింది. ప్రాచీన భారతీయ వాస్తుశిల్పం అద్భుతమైన నమూనాగా నిలిచింది. కాకతీయ రాజవంశం




వాస్తుశిల్ప వైభవానికి అద్భుతమైన నిదర్శనమే వరంగల్ కోట. 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ కోట కాకతీయుల రాజధానిగా, వ్యూహాత్మక స్థానంగా పనిచేసింది. 3 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భవ్యమైన ప్రాకారాలు, దీని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. కాకతీయ కళాతోరణం అనే సూక్ష్మశిల్పాలు కలిగిన తోరణం ఈ కోటకు ప్రత్యేక ఆకర్షణ. స్వయంభూ దేవాలయంలోని శివలింగం భక్తులకు పవిత్ర తీర్థస్థలం. కోటలోని ధాన్యాగారాలు, సరుకు గిడ్డంగులు ఆ కాలపు సంపదను తెలియ జేస్తున్నాయి. తెలంగాణ సంపన్న సాంస్కృతిక వారసత్వానికి ఈ కోట ఒక జీవంత ముద్ర. చారిత్రక ప్రాధాన్యత, శిల్ప సౌందర్యం కారణంగా ప్రతి ఒక్కరూ ఇక్కడికి తప్పక వెళ్లాల్సిన ప్రదేశంగా ఇది నిలిచింది. ములుగు జిల్లా పాలంపేట వద్ద ఉన్న రామప్ప గుడి, కాకతీయ సామ్రాజ్యం వాస్తు శిల్ప సంపదకు ప్రతీక. ఇది 13వ శతాబ్దంలో గణపతి దేవ మహారాజు పాలనలో నిర్మించబడింది. ఈ శివాలయానికి ప్రధాన శిల్పి రామప్ప పేరు మీదుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శిల్పాలు, సుందరమైన నృత్య ముద్రలు, పురాణ కథలను చిత్రించే శిల్పాకృతులు అద్భుతంగా ఉంటాయి. 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడిన ఈ దేవాలయం చుట్టూ సహజ సుందరమైన చెరువు, హరిత వనాలు ఉన్నాయి. పోచంపల్లి ప్రాంతంలో నేతన్న మేధస్సుతో తయారయ్యే పోచంపల్లి ఇక్కత్ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ నేతకళలో నూలు లేదా పట్టుదారాలను డైలో ముందుగా రంగు వేసి, సంక్లిష్టమైన జ్యామితీయ నమూనాలతో నేస్తారు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే.. 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలు ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, గ్రామీణ పర్యాటకంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు , పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించుకునేందుకు తద్వారా గ్రామీణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా వరంగల్ , హన్మకొండ , ములుగు, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను షోకేజ్ కు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈనెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, బుద్ధిష్ట థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నారు. అలాగే ఈ నెల 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్‌లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్టును సందర్శిస్తారు. ఇదే రోజు వరంగల్ జిల్లాలో యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. అక్కడే ఏర్పాటు- చేసిన పేరిణి నృత్యంను తిలకిస్తారు. 15న యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్‌పీరియన్సల్ టూర్‌లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. 16న మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి వృక్షాన్ని సందర్శిస్తారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల చే నిర్వహించే ఆర్ట్స్ , క్రాఫ్ట్స్ వర్క్ షాప్‌కు హాజరవుతారు. స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మొత్తంగా తెలంగాణ టూరిజానికి ప్రాముఖ్యత ఏర్పడనుంది.

## పుట్టిన పాపకు సిందూర్ నామకరణం

- బీహార్‌లో ఓ కుటుంబం నిర్ణయం



**పాట్నా,మే8( వెలుతురు):**

బిహార్‌లో ఆసక్తికర సంఘటన చోటు- చేసుకుంది. కాతిహార్ జిల్లాలోని కుందన్ కుమార్ మండల్ తన కుమార్తెకు సిందూర్ అని పేరు పెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా దాయాది దేశం పాకిస్థాన్‌పై కేంద్రం సిందూర్ పేరుతో సైనిక చర్యకు పాల్పడిన రోజు.. తమకు పాప జన్మించిందని ఆయన వివరించారు. అందుకే తమ పాపకు సిందూర్ అనే పేరు పెట్టినట్లు- తెలిపారు. ఈ పాపకు సిందూర్ అంటే అర్థం ఇప్పుడే తెలియక పోవచ్చు. కానీ ఆమె పెరిగి పెద్దదైన తర్వాత ఆ పేరుకు అర్థం తెలుసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అమాయకుల ప్రాణాలను తీయడం ద్వారా దేశానికి హాని కలిగించే పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల పీచమణచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ చర్య చేపట్టడం తమకు గర్వంగా ఉందన్నారు. పాపకు ఈ పేరు పెట్టడం పట్ల తమ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేసుకున్నారు. మరోవైపు పాపకు సిందూర్ పేరును ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది సైతం ఆమోదించారని చెప్పారు. మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రమూకల స్థావరాలపై భీకర దాడులు జరిపింది. ఈ దాడుల్లో దాదాపు 100 మంది మరణించినట్లు- భారత్ ప్రకటించింది. భారత్ చేపట్టిన ఈ చర్యకు సిందూర్ అని కేంద్రం నామకరణం చేసింది. అదే రోజు.. కుందన్ కుమార్ మండల్‌కు కుమార్తె జన్మించడంతో ఆమెకు ఈ పేరును పెట్టారు.

## కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదు

- బిఆర్ఎస్‌ను తిట్టడమేపనిగా పెట్టుకుంది
- మాజీమంత్రి ఎర్రబెల్లి దాయకర్ రావు



**వరంగల్,మే8( వెలుతురు):**

రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలించడం చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం దివాలా తీయిస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఐనవోలు, వర్ధన్నపేట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందనేవిధంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని చెప్పడం వల్ల అనేక పరిశ్రమలు, పెట్టు-బడిదారులు వెనకడుగు వేస్తున్నారని అన్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో నిజంగానే తెలంగాణ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయే ప్రమాదం ఉందన్నారు. కొత్తగా రాష్ట్రం ఏర్పడిన కూడా పదేళ్లపాటు-గా కేసీఆర్ ముఖ్యమంత్రిగా సమర్థవంతగా పనిచేయడం జరిగిందన్నారు. అనేక పరిశ్రమలు తెలంగాణకు వచ్చి పారిశ్రామిక ప్రగతి సాధించిందన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత క్రమంగా రాష్ట్రం అనేక ఇబ్బందుల్లో పడిపోతున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహా మంత్రులు కేవలం దోచుకోవడం, దాచుకోవడంతోనే సరిపుచ్చుకుంటు-న్నారని అన్నారు. రాష్ట్రంలో తిరిగి మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు. అలాగే ఉగ్రవాదంపై భారత సైన్యం చేస్తున్న యుద్ధానికి మద్దతుగా బీఆర్ఎస్ చేపట్టిన ర్యాలీలో మాజీ మంత్రి దయాకర్‌రావు జాతీయ జెండా పట్టు-కొని పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని సమూలంగా తుదముట్టించేందుకు భారతసైన్యానికి దేశ ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తూ రాజకీయాలను పక్కన బెట్టాలని కోరారు.

## హెలికాప్టర్ కూలి ఆరుగురు పర్యాటకుల మృతి

**డెహ్రాడూన్,మే8( వెలుతురు):**

ఉత్తరాఖండ్ లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పర్యాటకులతో వెళ్తున్న ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురు పర్యాటకులు మృతి చెందారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరకాశీలో గంగోత్రి వైపు వెళ్తున్న ఒక ప్రైవేటు- హెలికాప్టర్ గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో హెలీకాప్టర్‌లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఆరుగురు మృతి చెందగా.. ఒకరికి గాయాలయ్యాయి. పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు.




## కార్యకర్తలను ఇబ్బది పెట్టిన వారిని వదిలి పెట్టం

- రాసి పెట్టుకుఓండి...లెక్కలు తేలుస్తాం
- పోలీసులను మరోమారు మెచ్చరించిన జగన్



**అమరావతి,మే8( వెలుతురు):**

ఎవ్వరినీ వదలం.. ఎక్కడున్నా.. కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి అని వైఎస్ జగన్ హెచ్చరించారు. లెక్కలు తేలుస్తామని అన్నారు.. వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ- అయిన వైఎస్ జగన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మీ బాధలు చూస్తున్నాను.. హామీ ఇస్తున్నాను.. కేవలం వైసీపీని ప్రేమించినందుకు, పార్టీని అభిమానించినందుకు కార్యకర్తలు పడుతున్న బాధను చూశాను.. అందుకే జగన్ 2.0 లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. వారికి పూర్తి న్యాయం చేస్తాను.. ఎవ్వరినీ వదలం.. ఎక్కడున్నా.. కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి.. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదామని హెచ్చరించారు. ఈరోజు చంద్రబాబు, పోలీసులు చేస్తున్న దుర్మార్గం.. వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో రేపు అదే పెరుగుతుందన్నారు జగన్.. అందుకే ఈరోజు దౌర్జన్యాలు చేస్తున్న అధికారులు, పోలీసులు.. ఆరోజు ఎక్కడున్నా, రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టం.. అది మామూలుగా ఉండదు అని వార్నింగ్ ఇచ్చారు.. పశ్నించకూడదని నిరంకుశత్వం, డైవర్షన్.. ఈరోజు తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు. సంబంధం లేకున్నా కేసుల్లో ఇరికిస్తున్నారు.. ఇలాంటి రాజకీయాలు గతంలో ఏనాడూ చూడలేదు.. చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడంటే, ఆయన ప్రజల్లో చులకన అయ్యారు. హామీలు అమలు చేయడం లేదు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది.. ఎవరూ ప్రశ్నించకూడదని, రాష్ట్రంలో భయానక పరిస్థితి సృష్టిస్తున్నాడని పేర్కొన్నారు.. ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజల్లో వ్యతిరేకత కనిపించినా, వెంటనే డైవర్షన్. ఒకరోజు తిరుపతి లడ్డూ అంటాడు. ఇంకోరోజు సినీ నటి కేసు అంటాడు.. వారికి ప్రజల్లో వెళ్లే ధైర్యం లేదు.. ప్రజలు అడిగే ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పలేదు. టీ-డీపీ వారు ఎక్కడికి వెళ్ళినా.. ఏం జరుగుతుంది.. నా 15 వేలు ఏమయ్యాయని పిల్లలు, మా 26 వేలు ఏమయ్యాయని రైతులు, అవ్వలు వారి 48 వేలు, యువత తమ 36 వేలు ఏమయ్యాయని అడుగుతారు.. ఎన్నికల ముందు మాట ఇచ్చి, మోసం చేయడంతో సమాధానం చెప్పలేని దుస్థితి. అన్ని వ్యవస్థలు నాశనం. నిర్వీర్యం చేశారని వైసీపీ అధినేత వైఎస్ జగన్..మండిపడ్డారు.

## ఆపరేషన్ సిందూర్ అద్భుతం

### ఆర్మీకి మంత్రి ఉత్తమ్ అభినందనలు



**సూర్యాపేట,మే8( వెలుతురు):**

జమ్మూకశ్మీర్‌లో ఇటీవల భారత పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రమూకలు దాడులకు భారీత్ ప్రతీకారం తీర్చుకోవడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమర్థించారు. మాజీ సైనికుడిగా భారత్ సైన్యానికి మంత్రి ఉత్తమ్ శుభాకాంక్షలు తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భారత బలగాలపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు. భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై చేసిన దాడులు విజయవంతంగా పూర్తి చేసిందని అన్నారు. భారత సైన్యం సమర్థవంతంగా శత్రువుల మీద దాడి చేసి భారత సైన్య లక్ష్యాలను పూర్తి చేసి పాకిస్తాన్‌కి సరైన గుణపాఠం చెప్పిందని అన్నారు. గురువారంకోదాడ పట్టణంలో వెంకటేశ్వర మల్టీస్పెషాలిటీ- హాస్పిటల్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పట్టణంలో మెరుగైన వైద్యం సేవలు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ విజయవంతం అవడంతో ర్యాలీ నిర్వహించాలని భారత సైన్యానికి సంఘీభావంగా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు.

## 11నుంచి పాడేరు మోదకొండమ్మ జాతర

- సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందచేత
- వివరాలు వెల్లడించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**అమరావతి,మే8( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా పాడేరులోని మోద కొండమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తామని మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గురువారం అమరావతిలో వెల్లడించారు. మే 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు- ఈ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. మరోవైపు.. ఈ జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు గురువారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆహ్వాన పత్రిక అందిజేశారు.అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని గిరిజనుల కొంగు బంగారంగా పూజలందుకునే ఈ అమ్మ వారి జాతరను ఏపీ ప్రభుత్వ పండుగగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సారి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు- ఆమె వివరించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ ఇచ్చి మూడు రోజులపాటు- ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గిరిజన సాంప్రదాయ వంటలు అన్నం, పప్పు, బూరెలు, అరిసెలు, అట్లు- నైవేద్యంగా సమర్పిస్తామని చెప్పారు. తెలంగాణాలో సమ్మక్క, సారలమ్మ తరహాలోని ఆంధ్రప్రదేశ్‌లోనూ మోదకొండమ్మ అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు- తెలిపారు. దేవాలయం ఒకచోట, అమ్మవారి పాదాలు మరోక చోట ఉండడం ఈ గిరిజన జాతర ప్రత్యేకతలన్నారు. పాడేరు గ్రామ పొలిమేరల్లో అమ్మవారి పాదాలకు పూజ చేశాక జాతరకు రావడం అనవాయితీగా వస్తుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వివరించారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక అమ్మవారి జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ జాతరకు ఒడిశాతోపాటు- ఏపీ నలుమూలల నుంచి దాదాపు 5 లక్షల మంది గిరిజనులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు- చెప్పారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com